కృష్ణా యూనివర్సిటీలో కాంట్రాక్టు అధ్యాపకులను కొనసాగించే అంశం ఇంకా కొలిక్కిరాలేదు. వారి పనితీరును అంచనా వేసేందుకు ఈ నెల 19వ తేదీ నుంచి 26వ తేదీ వరకు ఇంటర్వ్యూలకు హాజరుకావాలని యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఈ నెల 17వ తేదీన ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం జరుగుతున్న ప్రక్రియ తమ పనితీరును అంచనా వేసేందుకు కాదని, తమను పొమ్మనలేక పొగ బెట్టేందుకేనని కాంట్రాక్టు అధ్యాపకులు అంటున్నారు. తమ స్థానంలో కొత్త వారిని నియమించుకునే కుట్ర జరుగుతోందని ఆరోపిస్తున్నారు.

ముదురుతున్న వివాదం

కృష్ణా వర్సిటీలో కాంట్రాక్టు అధ్యాపకులు, అధికారుల మధ్య రగడ

26వ తేదీ వరకు ఇంటర్వ్యూలకు హాజరు కావాలని ఆదేశాలు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం: కృష్ణా యూనివర్సిటీలో పదిహేడు సంవత్సరాలుగా పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకుల పనితీరును అంచనా వేసేందుకు ఇన్నేళ్ల తర్వాత ఇంటర్వ్యూలు ఏర్పాటు చేశారు. కాంట్రాక్టు అధ్యాపకులు ఇంటర్వ్యూలకు ఆయా సబ్జెక్టుల వారీగా హాజరుకావాల్సిన తేదీల షెడ్యూల్‌ను అధికారులు ప్రకటించారు. ఈ నెల 19న కెమిస్ట్రీ, ఫిజిక్స్, 21న కామర్స్, బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం, మేథమెటిక్స్, అప్లైడ్ మేథమెటిక్స్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, 23న బయోకెమిస్ట్రీ, 25న ఇంగ్లీష్, 26న ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, ఫార్మాస్యూటికల్స్ సబ్జెక్టులు బోధించే అధ్యాపకులు హాజరుకావాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. వీరు వచ్చే సమయంలో గతేడాదిలో సమర్పించినకనీసంగా రెండు జర్నల్స్‌ను తీసుకురావాలని స్పష్టం చేశారు. ఇన్నేళ్ల ఎటువంటి ఇంటర్వ్యూలు లేకుండానే కొనసాగించిన అధికారులు ఇప్పుడు ఇంటర్వ్యూలు పెట్టడం తమను ఇబ్బంది పెట్టడానికేనని గ్రహించిన కాంట్రాక్టు అధ్యాపకులు ఇంటర్వ్యూలకు హాజరుకాలేదు. ఎవరూ హాజరుకాబోమని మిగతా 6లో..

వర్సిటీకి నూజివీడు పీజీ సెంటర్ ప్రిన్సిపాల్ లేఖ

వర్సిటీకి అనుబంధంగా ఉన్న నూజివీడు పీజీ సెంటరులో పనిచేసే వారంతా కాంట్రాక్టు అధ్యాపకులే. వీరు తనకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఈ నెల 18వ తేదీ నుంచి మూకుమ్మడిగా విధులకు హాజరు కావడం లేదని, దీంతో పీజీ సెంటరులో పాఠ్యాంశాల బోధన, ఇతరత్రా పరిపాలనా పరమైన అంశాలు నిలిచిపోయాయని పీజీ సెంటరు ప్రిన్సిపాల్ జె.నవీన లావణ్య లత యూనివర్సిటీకి మెయిల్ ద్వారా సమాచారం పంపారు. నూజివీడు పీజీ సెంటరుతో పాటు, కృష్ణా యూనివర్సిటీలో పనిచేసే కాంట్రాక్టు అధ్యాపకులు తమ సమస్య పరిష్కారమయ్యే వరకు విధులకు దూరంగానే ఉంటున్నారు. ఒక వైపు పీజీ కోర్సుల్లో నూతనంగా విద్యార్థినీ విద్యార్థులు చేరుతున్నారు. వారు యూనివర్సిటీకి వచ్చిన కొద్ది రోజులకే పాఠ్యాంశాల బోధన నిలిచిపోవడంతో వివిధ కోర్సుల్లో చేరిన విద్యార్థుల్లో అయోమయం నెలకొంది.

హాజరుకాబోమని స్పష్టం చేసిన అధ్యాపకులు

- ఇంటర్వ్యూల వెనుక కుట్రకోణం ఉందని ఆరోపణ
- మంత్రి నారా లోకేశ్‌ను కలిసే యోచన
- గవర్నర్‌కు కూడా ఫిర్యాదు చేసేందుకు సిద్ధం



కృష్ణా యూనివర్సిటీ

ఈ ఏడాది ఇంక్రిమెంట్‌లు బంద్!

కాంట్రాక్టు అధ్యాపకులకు ఏటా రూ.వెయ్యి ఇంక్రిమెంట్ వేస్తారు. ప్రస్తుతం పనితీరును అంచనా వేసేందుకు జరిగే ఇంటర్వ్యూలకు హాజరు కాని వారికి ఈ ఏడాది ఇంక్రిమెంట్ ఇవ్వబోమని ఇటీవల జరిగిన చర్చల్లో యూనివర్సిటీ అధికారులు స్పష్టం చేశారు. ఇంక్రిమెంట్ సంగతి తర్వాత.. ముందు జూన్ నెల జీతం ఇవ్వాలని కాంట్రాక్టు అధ్యాపకులు పట్టుబట్టారు. ఈ విషయంపై యూనివర్సిటీ అధికారులు మిన్నకుండిపోయారని అంటున్నారు. యూనివర్సిటీలో పనిచేసే సీనియర్ కాంట్రాక్టు అధ్యాపకులను కాదని, జిల్లాలోని డిగ్రీ కళాశాలల్లో పనిచేసే అధ్యాపకులకు యూనివర్సిటీలో కాంట్రాక్టు అధ్యాపకులుగా నియమించే కుట్ర జరుగుతోందని, ఈ అంశంపై విద్యాశాఖమంత్రి నారా లోకేశ్‌ను కలిసి వివరిస్తామని, యూనివర్సిటీ అధికారుల తీరుపై గవర్నర్‌కు కూడా ఫిర్యాదు చేస్తామని కాంట్రాక్టు అధ్యాపకులు చెబుతున్నారు.



రియల్ ఎస్టేట్ రంగానికి ఊతం!

కీలక నిర్ణయాలు తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం

- డెవలప్‌మెంట్ అగ్రిమెంట్లకు 3 శాతం స్టాంప్ డ్యూటీ తగ్గింపు
- సేల్ కమ్ జీపీఏలకు కూడా 7.5 శాతం నుంచి 4 శాతానికి కుదింపు

ఉమ్మడి కృష్ణాజిల్లాలోని సబ్ రిజిస్ట్రార్లకు ఆదేశాలు జారీ

డెవలప్‌మెంట్ అగ్రిమెంట్లు, సేల్ కమ్ జనరల్ పవర్ ఆఫ్ అటార్నీకి సంబంధించిన స్టాంప్ డ్యూటీని తగ్గిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలతో ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఇక రియల్ ఎస్టేట్ రంగం పరుగులు పెట్టనుంది. ర్యాపిడ్ గ్రోత్ ఏరియాగా ఉన్న విజయవాడ, గ్రేటర్ విలీన ప్రతిపాదిత గ్రామాల్లో సైతం కొద్దికాలంగా నెలకొన్న స్తబ్దతకు ఇక ఫుల్‌స్టాప్ పడనుంది. రాజధాని ప్రాంత పరిధిలో కూడా రియల్ ఎస్టేట్ కార్యకలాపాలు ఊపందుకోనున్నాయి.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): రియల్ ఎస్టేట్ రంగానికి ఊతం ఇచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం రెండు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఈ మేరకు రిజిస్ట్రేషన్స్ శాఖ ఉన్నతాధికారులకు ఆదేశాలు ఇచ్చింది. దీంతో ఉమ్మడి కృష్ణాజిల్లాలోని సబ్ రిజిస్ట్రార్లకు ఐజీ నుంచి ఆదేశాలు అందాయి. భూ యజమాని, బిల్డర్ మధ్య డెవలప్‌మెంట్ అగ్రిమెంట్లకు ప్రస్తుతం వసూలు చేస్తున్న నాలుగు శాతం స్టాంప్ డ్యూటీని ఇక మీదట ఒక శాతం మాత్రమే వసూలు చేసేలా ఆదేశాలు ఇవ్వటం జరిగింది. గతంలో ఒక శాతం స్టాంపు డ్యూటీ ఉండేది. ఆ తర్వాత దీనిని నాలుగు శాతం పెంపుదల చేశారు. ఒకే సారి మూడు శాతం పెంపుదల వల్ల స్టాంపు డ్యూటీ కట్టడం కష్టంగా ఉందన్న భావన బిల్డర్ల నుంచి వ్యక్తమవుతోంది. ఈ కారణంగా గిట్టుబాటు కావటం లేదని బిల్డర్లు వెనక్కి తగ్గుతున్నారు. దీంతో డెవలప్‌మెంట్ మిగతా 6లో..

జిల్లాలో భారీ వర్షం

అత్యధికంగా కోడూరులో 29.4 మిల్లీమీటర్లు

- జిల్లా సగటు వర్షపాతం 14.5 మిల్లీమీటర్లు నమోదు
- 26వ తేదీ వరకు కోస్తాతీరం వెంబడి వర్షాలు



కానూరు మెయిన్ రోడ్డులో..

మచిలీపట్నం,జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఉపరితల ఆవర్తనంతో జిల్లాలోని పలు ప్రాంతాల్లో మంగళవారం ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. ఉదయం 8.30 గంటల వరకు కోడూరులో అత్యధికంగా 29.4 మిల్లీ మీటర్లు, పెదపారుపూడిలో అత్యల్పంగా 4.2 మిల్లీమీటర్లు పడింది. జిల్లా సగటు వర్షపాతం 14.5 మిల్లీమీటర్లుగా నమోదైంది. ఘంటసాలలో 28.6, మొవ్వలో 28.9, చల్లపల్లిలో 27.6, తోట్లవల్లూరులో 27.4, పమిడిముక్కలలో 26.6, పెనుమలూరులో 25.4, అవనిగడ్డలో 19.2, పెడనలో 18.8 మోపిదేవిలో 16.2, నాగాయలంకలో 15.4, కంకిపాడులో 14.0, బాపులపాడులో 13.8, నందివాడలో 13.2 మిల్లీమీటర్ల చొప్పున వర్షం పడింది. మిగిలిన మండలాల్లో 10 మిల్లీ మీటర్ల కన్న తక్కువ వర్షపాతం నమోదైంది. వ్యవసాయ పనులకు అనుకూలంగా వర్షాలు కురుస్తుండటంతో వరినాట్లు వేసే పనులు గత వారం రోజులుగా జిల్లాలో ఊపందుకున్నాయి. ఈ నెల 26వ తేదీ వరకు కోస్తాతీరం వెంబడి పలు ప్రాంతాల్లో ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేసింది.

పేదలకు రేషన్ బియ్యం పంపిణీ చేయని చౌక దుకాణాల డీలర్లను ప్రభుత్వం ఐవీఆర్ఎస్ సర్వే ద్వారా కనిపెట్టింది. ఉమ్మడి కృష్ణాజిల్లాలో 40 టన్నుల రేషన్ బియ్యం కార్డుదారులకే చేరలేదని నిగ్గు తేల్చింది. ఆయా వివరాలను ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల జాయింట్ కలెక్టర్లకు సివిల్ సప్లయిస్ ఉన్నతాధికారులు పంపించారు. విచారణ అనంతరం చర్యలు తీసుకోనున్నారు.

బియ్యం దొంగలు దొరికారు!

రేషన్ పంపిణీపై ఐవీఆర్ఎస్ సర్వే చేయించిన ప్రభుత్వం

- ఉమ్మడి కృష్ణాజిల్లాలో 15,681 కార్డుదారులకు కాల్
- రేషన్ బియ్యం తీసుకున్నారా అని ప్రశ్న
- తీసుకోలేదని 2,940 మంది సమాధానం
- సర్వే ప్రకారం 40 టన్నుల బియ్యం మాయం
- ఎన్టీఆర్, కృష్ణా జేసీలకు ఐవీఆర్ఎస్ జాబితాలు
- రేషన్ దుకాణం డీలర్లను విచారించనున్న అధికారులు



(ఆంధ్రజ్యోతి, విజయవాడ): ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్)లో భాగంగా జరుగుతున్న రేషన్ బియ్యం పంపిణీకి సంబంధించి కార్డుదారుల మిగతా 6లో..

వీడిన 'గుట్టు'

ఐవీఆర్ఎస్ సర్వే నూటికి నూరు శాతం ఖచ్చితత్వం అనిచెప్పకపోయినా.. చాలా వరకు జరుగుతున్న అంశాలనే తెలుపుతుంది. ప్రజాపంపిణీ వ్యవస్థలో ఉన్న లో 'గుట్టు'ను బహిర్గతం చేసింది. దీనిని బట్టి చూస్తే.. కార్డుదారులకు ఇవ్వాల్సిన బియ్యాన్ని రేషన్ డీలర్లు ఏ విధంగా బొక్కేస్తున్నారో తేటతెల్లం అవుతోంది.

రొయ్యూరు అక్రమ క్వారీల నిర్వాహకుడు తగ్గేదేలే అంటూ మరింత రెచ్చిపోతున్నాడు. మంగళవారం ఉదయం 10 గంటలకే క్వారీలోకి రెండు ఎక్స్‌కవేటర్‌లను మళ్లీ దింపేశాడు. రాత్రికి ఇసుక తవ్వకాలు చేపట్టేందుకు రహదారిలో గోతులు పూడ్చేందుకు ఐదు లారీల రబ్బీసు తోలించాడు. గత శనివారం 'అర్ధరాత్రి తవ్వకాలు', ఆదివారం 'ఇంత బరి తెగింపా' శీర్షికలతో 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనాలతో అధికారులు రెండు ఎక్స్‌కవేటర్‌లను బయటకు పంపించి ఇసుక, బుసక తవ్వకాలు ఆపగా, మంగళవారం 'ఐ డోంట్ కేర్' అంటూ ఆ రెండు ఎక్స్‌కవేటర్‌లను ఇసుక క్వారీలోకి తీసుకు రావటం తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

తగ్గేదేలే!

మళ్లీ రొయ్యూరు అక్రమ క్వారీలోకి రెండు ఎక్స్‌కవేటర్‌లు

- రాత్రివేళ తవ్వకాలకు రంగం సిద్ధం చేసిన అక్రమార్కుడు
- యంత్రాలను సీజ్ చేయకుండా వదిలేయటంతో లెక్కలేనితనం
- నిస్సహాయ స్థితిలో రెవెన్యూ అధికారులు
- అతని వెనుక బడానేత ఉన్నట్టు అందరికీ బెదిరింపులు



మంగళవారం రొయ్యూరు క్వారీలోకి వచ్చిన రెండు ఎక్స్‌కవేటర్‌లు

అచేతన స్థితిలో అధికారులు

రొయ్యూరు ఎస్సీ సొసైటీ వద్ద రెండు అక్రమ క్వారీలను అనుమతులు లేకుండా, గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలను తుంగలోతొక్కి ఏర్పాటు చేసినప్పటికీ రెవెన్యూ, మైనింగ్ అధికారులు చర్యలు తీసుకోలేకపోతున్నారని విమర్శలు వస్తున్నాయి. రేపు జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్‌కు అధికారులే సమాధానం చెప్పుకోవాలి.

ఎవరా పెద్ద తలకాయ?

నా వెనుక పెద్ద తలకాయ ఉందని ఆ పాత వైసీపీ నేత అందరిని బెదిరిస్తున్నట్టు తెలిసింది. అధికార పార్టీలోని పెద్ద నేత సపోర్టు ఉందని బహిరంగంగా చెపుతున్నారు. నియమ నిబంధనలను ఉల్లంఘించి క్వారీలకు అధికార పార్టీ పెద్ద తలకాయ ఎలా మద్దతుగా నిలుస్తున్నారో అంతు చిక్కకుండా ఉంది. అక్రమాలను సహించేది లేదని సీఎం చంద్రబాబు హెచ్చరిస్తున్నా ఇక్కడ పెడచెవిన పెడుతుండటం పెద్ద చర్చనీయాంశంగా మారింది.

తోట్లవల్లూరు, జూలై 22(ఆంధ్రజ్యోతి): రొయ్యూరు ఎస్సీ సొసైటీ దగ్గర సర్వే నెం. 312/2లోని అసైన్డ్ పట్టా భూముల్లో గతంలో వైసీపీతో ప్రత్యక్ష సంబంధాలున్న ఓ వ్యక్తి ఎలాంటి అనుమతి లేకుండా ఇసుక, బుసక క్వారీలను ఏర్పాటు చేశారు. మే నెలలోనే క్వారీలు ఏర్పాటు చేయగా 'ఆంధ్రజ్యోతి' కథనంతో ఆపి జూలై 13వ తేదీ నుంచి మళ్లీ క్వారీలు తెరిచారు. ఒకవైపు జూన్ నుంచి అక్టోబర్ 15వ తేదీ వరకు నదీపాయల్లో ఇసుక తవ్వకాలను జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ నిషేధించి కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించింది. స్టాక్ యార్డుల్లోనే ఇసుకను ప్రజలకు అందించాలని ఆదేశాల్లో పేర్కొంది. అయితే అవేమి లెక్కచేయకుండా, అధికార పార్టీలోని పెద్దలను మచ్చిక చేసుకుని జూలైలో ఇసుక తవ్వకాలు చేపట్టటం సర్వత్రా విమర్శలకు గురవుతోంది. అదే మంటే స్టాక్ యార్డు కాంట్రాక్టర్లు కూడా నదీపాయల్లో ఇసుక తవ్వకాలు చేస్తున్నారని, వారిని ఎవ్వరు ఆపటం లేదని, తననే అల్లరి చేస్తున్నారని ఆ వైసీపీ(పాత)నేత మీడియాపైనే మిగతా 6లో..

నిర్లక్ష్యమంత గండి!



- కోతకు గురైన లింగన్న కోడు వంతెన రోడ్డు
- కొత్తమాజేరుకు నిలిచిన రాకపోకలు

6

గవర్నర్ పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి 6

తూకంలో తేడా వస్తే కఠిన చర్యలు : నాదెండ్ల 6

అమరావతి రైల్వేలైన్ అలైన్‌మెంట్ మార్పు! 8



కేఎల్ రావు హెడ్ వాటర్‌వర్క్స్‌లో నీటి శుద్ధి విధానాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

తాగునీటిపై నిరంతర అప్రమత్తత

- శుద్ధి, సరఫరా వ్యవస్థలో లోపాలు లేకుండా చూడాలి
- కలుషితం కాకుండా పటిష్ట పర్యవేక్షణ అవసరం
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : వర్షాకాలం నేపథ్యంలో నగర ప్రజలకు సరఫరా చేసే తాగునీటి శుద్ధి, నాణ్యతా ప్రమాణాలు, సరఫరా వ్యవస్థలో ఎక్కడా లోపాలు లేకుండా.. ప్రతి విషయంలోనూ అప్రమత్తంగా వుండాలని కలెక్టర్ లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. మంగళవారం విజయవాడ నగర పాలక సంస్థ డాక్టర్ కేఎల్ రావు హెడ్ వాటర్ వర్క్స్‌ను కలెక్టర్ సందర్శించి నీటి శుద్ధి, పంపిణీ విధానాన్ని పరిశీలించారు. ఆధునిక మౌలిక వసతులపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. 5 ఎంజీడీ ఇన్‌టేక్‌వెల్, ఫిల్టరేషన్ ప్లాంట్, క్లారిఫ్లోక్యులేటర్, క్లోరినేషన్ ప్లాంట్, పంప్ హౌజ్ తదితరాల పనితీరును పరిశీలించారు. రెసిడ్యూల్ క్లోరిన్ పరీక్ష తీరుతెన్నులను పరిశీలించారు. రోజుకు 210 ఎంఎల్‌డీ తాగునీటిని సరఫరా చేస్తున్నట్టు వెల్లడించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సురక్షిత తాగునీరు ప్రజల ఆరోగ్య భద్రతకు అత్యంత కీలకమని, అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ పనిచేయాలని సూచించారు. ప్రత్యేక బృందాలు నిరంతర తనిఖీలతో నీటి సరఫరా వ్యవస్థను పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. పర్యటనలో కలెక్టర్ వెంట నగర పాలక సంస్థ చీఫ్ ఇంజినీర్ ఆర్.శ్రీనాథరెడ్డి, పర్యవేక్షణ ఇంజినీర్ పి.సత్యకుమారి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వెంకటేశ్వరరెడ్డి వున్నారు.

రైల్వే సమస్యల పరిష్కారానికి

సత్వర చర్యలు తీసుకోండి

- రైల్వే బోర్డు చైర్మన్ సతీష్ కుమార్‌కు ఎంపీ కేశినేని శివనాథ్ వినతి


సతీష్‌కుమార్‌ను సత్కరిస్తున్న ఎంపీ శివనాథ్

రైల్వేస్టేషన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలోని సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని, అమృత భారత స్టేషన్ 2.0 పథకం కింద విజయవాడ స్టేషన్ అభివృద్ధికి నీతి అయోగ్ మంజూరు చేసిన నిధులను త్వరితగతిన విడుదల చేయించాలని రైల్వే బోర్డు చైర్మన్ సతీష్ కుమార్‌కు ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) విజ్ఞప్తి చేశారు. న్యూఢిల్లీలో రైల్వే బోర్డు చైర్మన్ సతీష్ కుమార్‌ను రైల్ భవన్‌లోని ఆయన కార్యాలయంలో మంగళవారం ఎంపీ కలిశారు. ఈ సందర్భంగా సతీష్‌కుమార్‌ను ఎంపీ శివనాథ్ శాలువాతో సత్కరించారు. అనంతరం విజయవాడ డివిజన్ పరిధిలో నెలకొన్న సమస్యలను ఎంపీ ప్రస్తావించారు. విజయవాడ డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న లెవెల్ క్రాసింగ్‌ల వద్ద రోడ్ ఓవర్ బ్రిడ్జిలు(ఆర్వోబీ), రోడ్డు అండర్ బ్రిడ్జి(ఆర్యూబీ)ల నిర్మాణం త్వరితగతిన పూర్తిచేసేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని విన్నవించారు. అలాగే అమృత భారత్ 2.0 పథకం కింద విజయవాడ స్టేషన్ అభివృద్ధికి నీతి అయోగ్ మంజూరు చేసిన రూ.836.47 కోట్ల నిధులను త్వరితగతిన విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని ఎంపీ కోరారు. ఎంపీ విజ్ఞప్తులపై రైల్వే బోర్డు చైర్మన్ సానుకూలంగా స్పందించటమే కాకుండా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.


డివిజన్ పర్యటనలో ప్రజలతో మాట్లాడుతున్న మంత్రి నారాయణ

'సుపరిపాలనలో తొలి అడుగు'

కార్యక్రమానికి విశేష స్పందన

- మంత్రి నారాయణ

పెడన, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : ఏడాది పాలన పూర్తయిన సందర్భంగా కూటమి ప్రభుత్వం చేపట్టిన 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందని మునిసిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి కె.నారాయణ అన్నారు. 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆయన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావుతో కలిసి పట్టణంలోని 5, 6, 7, 8 వార్డుల్లో పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, కూటమి పాలన, సంక్షేమ పథకాల అమలు పట్ల ప్రజలు పూర్తి సంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. 67 లక్షల మంది విద్యార్థులకు తల్లికి వందనం పథకం అమలు చేసి చరిత్ర సృష్టించామన్నారు. వార్డుల్లో ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నదీ లేనిదీ ఆరా తీశారు. కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు యక్కల శ్యామలయ్య, వహబ్‌ఖాన్, కమ్మగంటి బాబు, అబ్దుల్ ఖయూం (హన్ను), పడవల పైడేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


ఆసుపత్రి సూపరింటెండెంట్‌తో సమీక్షిస్తున్న డాక్టర్ ధీరజ్

టీబీ రహిత సమాజాన్ని ఏర్పాటు చేయాలి

- స్టేట్ వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ కన్సల్టెంట్ డాక్టర్ ధీరజ్

మచిలీపట్నం టౌన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : క్షయవ్యాధి రహిత సమాజం ఏర్పాటుకు వైద్యులు ముందుకు రావాలని, అందుకు ప్రజలు సహకరించాలని స్టేట్ వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ కన్సల్టెంట్ డాక్టర్ ధీరజ్ సూచించారు. జిల్లా సర్వజన ఆసుపత్రిని మంగళవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా జూన్ 2 నుంచి దేశ వ్యాప్తంగా అమలు చేస్తున్న టీబీ ముక్త్ భారత్ అభియాన్ వంద రోజుల కార్యక్రమంపై డాక్టర్ ధీరజ్ సమీక్షించారు. ఆసుపత్రికి వివిధ సందర్భాల్లో వచ్చే రోగులకు కూడా టీబీ టెస్టులు చేయాలన్నారు. పాఠశాలు, సచివాలయాల్లో, ప్రైవేటు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో క్షయవ్యాధి పరీక్షలు నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా జరిగిన సమీక్షలో డాక్టర్ ఆశాలత, ఆర్ఎంవో నిరంజన్, పల్మనాలజిస్టు డాక్టర్ కె.నాగలక్ష్మీ, లెప్రసీ వార్డు ఇన్‌చార్జి డాక్టర్ ఎ.వెంకట్రావు, ఐ స్పెషలిస్టు భానుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యం చివరకు రహదారిపై భారీ గండి పడే వరకు చేరింది. చల్లపల్లి మండలం కొత్తమాజేరు లింగన్నకోడు వంతెన ప్రమాదకర స్థితిలో పడింది. నీటి ప్రవాహ ఉధృతికి వంతెన కింద ఊల,మలుపుల్లో మట్టిపెళ్లలు విరిగిపడి వంతెనపైకి చేరుకునే తారురోడ్డుపై పెద్ద గొయ్యి ఏర్పడింది. దీంతో కొత్త మాజేరుకు రాకపోకలు నిలిచిపోయాయి.

- కోతకు గురైన లింగన్నకోడు వంతెన రోడ్డు
- 'ఆంధ్రజ్యోతి'లో కథనాలు వచ్చినా పట్టని అధికారులు
- కొత్తమాజేరుకు నిలిచిన రాకపోకలు
- వంతెన భవిష్యత్‌పై గ్రామస్థుల ఆందోళన

నిర్లక్ష్యమంత గండి!

మాజేరు రహదారిపై అగాధం

చల్లపల్లి, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : గుండేరు మేజర్ డ్రెయినేజీపై ఉన్న వంతెన శిథిలావస్థకు చేరుకున్న విషయం తెలిసిందే. ఇటీవల ఎగువ నుంచి భారీగా గుర్రపుడెక్క వంతెన వద్దకు చేరడంతో ఆదివారం నుంచి పొక్లెయిన్‌లతో తొలగింపు పనులు చేపట్టారు. వర్షాల కారణంగా ఎగువ నుంచి గుండేరులో ఉధృతంగా నీటిప్రవాహం వస్తోంది. డెక్క తొలగింపు పనులు జరుగుతున్న దశలో వంతెన కింది కానాల నుంచి నీటి ప్రవాహం దిగువకు వెళుతోంది. నీటి ఉధృతికి వంతెన అప్రోచ్ రోడ్డు కోతకు గురై దిగువ భాగాన ఊల పడటంతో రోడ్డు కుంగిపోయి మధ్యలో గొయ్యిపడింది. కొద్దిసేపటికి మట్టి కరిగిపోయి తారురోడ్డు పెళ్లలు విరిగి పడుతూ గొయ్యి కాస్త అగాధాన్ని తలపించేలా మారింది. దీంతో అప్రమత్తమైన స్థానిక నేతలు, పెద్దలు రాకపోకలు నిలిపివేశారు. తాటిచెట్టును రోడ్డుకు అడ్డుగా వేసి మరోవైపు ట్రాక్టర్‌ను ఉంచారు. సమాచారం తెలుసుకున్న ఆర్ఐ ఘంటసాల కృష్ణమోహన్, వీఆర్వో పరిశ కిరణ్‌కుమార్‌లు సంఘటనా ప్రదేశానికి వెళ్లి సహాయక చర్యలు చేపట్టారు. డీసీ వైస్ చైర్మన్ పరిశె చలపతిరావు, స్థానిక నేతలు పనులు పర్యవేక్షించారు.

మంగళాపురం, చిన్నాపురం మీదుగా వెళ్లాల్సిందే..

గొయ్యి ఏర్పడి వంతెనపై రాకపోకలు నిలిచిపోవటంతో ద్విచక్ర వాహనదారులు కొత్తమాజేరుకు చిన్నాపురం, మంగళాపురం మీదుగా వెళుతున్నారు. లింగన్నకోడు వంతెన పలు గ్రామాలకు ప్రధాన రహదారి మార్గం. అత్యంత ప్రాధాన్యత కలిగిన ఈవంతెన శిథిలావస్థకు చేరుకోగా దుస్థితిపై గతంలో ఆంధ్రజ్యోతి కథనం ప్రచురించింది. గుండేరులో నీటిఉధృతి, గుర్రపుడెక్క వంతెన వద్దకు చేరుకున్న నేపథ్యంలో వంతెన పటిష్టతపై ప్రజలు ఆందోళన చెందినట్టుగానే రోడ్డు కుంగిపోయి పూర్తిగా అగాధంగా మారి రాకపోకలు నిలిచిపోయాయి. అధికారులు తక్షణమే మరమ్మతులు నిర్వహించి రాకపోకలు పునరుద్ధరించటంతోపాటు కొత్త వంతెన నిర్మాణాన్ని త్వరగా చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఆర్అండ్‌బీ అధికారుల పరిశీలన

మాజేరు వంతెన రహదారి కుంగి రోడ్డుమధ్యలో గొయ్యిపడిన సమాచారం తెలుసుకున్న అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆర్అండ్‌బీ అధికారులతో మాట్లాడి గండి పూడ్చివేత పనులపై సూచనలు చేశారు. ఆర్అండ్‌బి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ లోకేశ్వరరావు, డీఈఈ సంగీత, ఏఈఈ సురేష్‌లు సంఘటనా ప్రదేశానికి చేరుకుని కుంగిపోయి అగాధంలా మారిన రహదారిని పరిశీలించారు. బుధవారం ఉదయం గండిని పూడ్చి రహదారిని పటిష్టపరిచి రాకపోకలు సాగించేలా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. అక్కడే ఉన్న రెవెన్యూ అధికారులు, గ్రామపెద్దలతో మాట్లాడారు. పనులు ఎలాచేయాలి అనే విషయమై కాంట్రాక్టరుకు సూచనలు అందచేశారు.


కొత్తమాజేరు వంతెన రోడ్డు మధ్యలో పడిన భారీ గొయ్యి, అడ్డుగా వేసిన తాటిచెట్టు, గండి పడిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఆర్అండ్‌బీ అధికారులు

తూకంలో తేడా వస్తే కఠిన చర్యలు

- గొల్లపూడి మార్కెట్ యార్డ్‌లో మంత్రి నాదెండ్ల ఆకస్మిక తనిఖీలు


గొల్లపూడిలోని గోడౌన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న మంత్రి నాదెండ్ల, గన్నవరం ఎంఎల్ఎస్ పాయింట్‌లో బియ్యం బస్తా కాటా చూస్తున్న మంత్రి

గొల్లపూడి/గన్నవరం, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : పేదలకు ఇచ్చే బియ్యం తూకంలో తేడాలు వస్తే సహించేది లేదని ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అధికారులను హెచ్చరించారు. మంగళవారం విజయవాడలోని గొల్లపూడి అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ ప్రాంగణంలోని సివిల్ సప్లయిస్ గోడౌన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. బియ్యం నిల్వలు, శుభ్రతపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. మిడ్ డే మీల్స్ క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి వాటి వివరాలు తెలుసుకున్నారు. ఆయిల్ ప్యాకెట్లు తూకం వేసి వాటి కొలతను నిర్ధారించారు. బియ్యం తూకంలో తేడా వస్తే కఠిన చర్యలు తప్పవని మంత్రి హెచ్చరించారు. గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన అవకతవకలను దృష్టిలో ఉంచుకుని కూటమి ప్రభుత్వం కఠినమైన తనిఖీలతో నిబంధనలను అమలు చేస్తుందని మంత్రి స్పష్టం చేశారు.

ఎంఎల్ఎస్ పాయింట్ల వద్ద పరిశుభ్రతను పాటించాలి

ఎంఎల్ఎస్ పాయింట్ల వద్ద పరిశుభ్రతను పాటించాలని మంత్రి నాదెండ్ల మనోహర్ అధికారులను హెచ్చరించారు. బియ్యం బస్తాలకు లీకేజీలు లేకుండా చూడాలన్నారు. గన్నవరం ఎంఎల్ఎస్ పాయింట్‌ను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేసి బియ్యం నాణ్యత, ప్యాకింగ్, తూకం, పరిశుభ్రతను పరిశీలించారు. షాప్ నెం-1 అల్లాపురం, 14 గన్నవరం, 44 వీరపనేనిగూడెం, 3 ఆత్కూరు రేషన్ షాపులను క్షుణ్ణంగా తనిఖీ చేసి రిపోర్టును పంపించాలని ఆదేశించారు. ఆయిల్ ప్యాకెట్, బియ్యం బస్తాలపై క్యూఆర్ కోడ్‌లను స్వయంగా ఫోన్‌లో పరిశీలన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఈ విద్యా సంవత్సరం నుంచి రాష్ట్రవ్యాప్తంగా 41,091 పాఠశాలలు, 3,800 సంక్షేమ హస్టళ్లకు 25కేజీ బస్తాల్లో బియ్యం పంపిణీ జరుగుతుందన్నారు. ఈ పథకాన్ని మరింత మెరుగు పరిచేందుకు బస్తాలపై క్యూఆర్ కోడ్ ముద్రించటం జరిగిందన్నారు. బియ్యంలో తేడాలు ఉంటే సహించేది లేదన్నారు. గత ప్రభుత్వంలో జరిగిన అవకతవకలను దృష్టిలో ఉంచుకుని, కూటమి ప్రభుత్వం కఠినమైన తనిఖీలతో నిబంధనలను అమలు చేస్తున్నట్టు మంత్రి స్పష్టం చేశారు. ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్‌చార్జి ఉదయ్, పీడీఎస్ డీటీలు అంకాలు, ప్రధాన్ తదితరులు పాల్గొన్నారు.

బియ్యం దొంగలు దొరికారు!

(5వ పేజీ తరువాయి)

అభిప్రాయాన్ని తెలుసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఐవీఆర్ఎస్ సర్వే చేయించింది. ఈ ఐవీఆర్ఎస్ సర్వేలో కార్డుదారులకు బియ్యం అందుతుందా లేదా అన్న ప్రశ్నకు ఉమ్మడి కృష్ణాజిల్లా నుంచి పెద్ద సంఖ్యలో కార్డుదారులు తమకు బియ్యం అందటం లేదని చెప్పారు.

కార్డుదారులకు చేరని 40 టన్నుల బియ్యం

ఉమ్మడి కృష్ణాజిల్లాలో మొత్తం 1,821 రేషన్ దుకాణాల పరిధిలో కార్డుదారులకు 'మీకు రేషన్ అందుతుందా' అని ఐవీఆర్ఎస్ ఫోన్ కాల్స్ వెళ్లాయి. ఎన్టీఆర్ జిల్లాలో 889 రేషన్ దుకాణాల పరిధిలో 8,253 కార్డుదారులకు సంబంధించి బియ్యం తీసుకున్నారా అన్న ప్రశ్నకు 6,782 మంది తీసుకున్నామని చెప్పగా, 1,471 మంది తీసుకోలేదని చెప్పారు. కృష్ణాజిల్లాలో 932 రేషన్ దుకాణాల పరిధిలోని 7,428 కార్డుదారుల్లో 5,959 మంది తీసుకున్నామని చెప్పగా, 1,469 మంది తీసుకోలేదని సమాధానం ఇచ్చారు. రెండు జిల్లాల్లో కలిపి 15,681 కార్డుదారులను బియ్యం తీసుకున్నారా అని ప్రశ్నించగా, 12,741 మంది తీసుకున్నామని, 2,940 మంది తీసుకోలేదని చెప్పారు. ప్రతి ఇంట్లో కనిష్టంగా నలుగురు సభ్యులు ఉంటారు. ఇంటికి ముగ్గురి చొప్పున పరిగణనలోకి తీసుకుంటే 2,940 మంది కార్డుదారులను మూడుతో హెచ్చవేస్తే మొత్తంగా 44,100 మందికి రావాల్సిన బియ్యం అందలేదని తేలుతుంది. ఈ బియ్యాన్ని క్వింటాళ్ల లెక్కన చూస్తే 441 క్వింటాళ్లు, టన్నుల ప్రాతిపదికన చూస్తే 40 టన్నులుగా తేలింది. అంటే.. నాలుగు రేషన్ దుకాణాలకు వచ్చే కోటాతో సమానం.

బయోమెట్రిక్ వేయించుకున్నా ఇవ్వలేదని వెల్లడి

సర్వే ప్రకారం చూస్తే కార్డుదారులు తమ దగ్గర బయోమెట్రిక్ వేయించుకున్నా బియ్యం ఇవ్వలేదని సమాధానం చెప్పినట్టు తెలిసింది. బయోమెట్రిక్ వేయించుకుని కార్డుదారుల దగ్గర బియ్యం కొనే డీలర్లు ఉన్నారు. ఇది బహిరంగ రహస్యం. జిల్లాలో రేషన్‌కార్డుల పోర్టబిలిటీ అమల్లో ఉంది. ఒక రేషన్ దుకాణానికి చెందిన వారు ఏ రేషన్ దుకాణంలో అయినా నిత్యావసరాలు తీసుకోవచ్చు. ఈ పోర్టబిలిటీ విధానంలో తను నివశించే డిపో పరిధిలో కాకుండా బయట మరెక్కడైనా డిపోలో బయోమెట్రిక్ వేసి.. బియ్యం తీసుకోకపోయి ఉంటే.. ఐవీఆర్ఎస్ సమాధానాలలో కొంత అస్పష్టత ఉన్నట్టే లెక్క. ఎందుకంటే ఐవీఆర్ఎస్ ద్వారా 'ఎక్స్' అనే చౌక దుకాణం పరిధిలోని డీలర్‌ను ప్రశ్న అడిగితే.. ఆ కార్డుదారుడు 'వై' అనే చౌకదుకాణం డీలర్ దగ్గర బయోమెట్రిక్ వేసి బియ్యం తీసుకోకుండా ఉంటే.. సమస్య వస్తుంది. ఐవీఆర్ఎస్‌లో దీనికి సంబంధించి స్పష్టంగా అడిగి ఉంటే.. ఈ సమస్య కూడా ఉండే అవకాశం లేదు.

విచారణ జరపనున్న జేసీలు

ఐవీఆర్ఎస్ నివేదికల ప్రకారం రెండు జిల్లాల జాయింట్ కలెక్టర్లు తమ దగ్గర ఉన్న డేటా ప్రకారం రేషన్ డీలర్లను విచారించే అవకాశం ఉంది. బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

రియల్ ఎస్టేట్ రంగానికి..

(5వ పేజీ తరువాయి)

అగ్రిమెంట్లు కూడా తగ్గిపోతున్నాయి. డెవలప్‌మెంట్ అగ్రిమెంట్స్ తగ్గిపోవటం వల్ల రిజిస్ట్రేషన్ శాఖకు ఆదాయం కూడా తగ్గిపోతోంది. డెవలప్‌మెంట్ అగ్రిమెంట్లను గణనీయంగా పెంచేందుకు వీలుగా.. నాలుగు శాతంగా ఉన్న స్టాంపు డ్యూటీని ఒక శాతానికి తీసుకువచ్చారు. అలాగే రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్స్ విషయంలో సేల్ కమ్ జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ (జీపీఏ)కి సంబంధించి కూడా కొన్ని మినహాయింపులు ప్రభుత్వం కల్పించింది. ఒక స్థలాన్ని జీపీఏ చేయించుకున్న వ్యక్తి ఆ స్థలాన్ని మరొకరికి విక్రయించినపుడు కొనుగోలు చేసిన వ్యక్తి 7.5 శాతం స్టాంపు డ్యూటీ చెల్లించాల్సి ఉండేది. ఇక మీదట కేవలం నాలుగు శాతం స్టాంపు డ్యూటీ చెల్లిస్తే సరిపోతుంది. దాదాపుగా 3.5 శాతం మేర స్టాంపు డ్యూటీ మినహాయింపు ఇవ్వటం జరిగింది. గతంలో సేల్ కమ్ జీపీఏ చేయించుకున్న వారికి మాత్రమే ఈ మినహాయింపు ఉండేది. జీపీఏ చేయించుకున్న వ్యక్తి బయట వాళ్లకు విక్రయిస్తే ఈ మినహాయింపు ఉండేది కాదు. తాజాగా బయట వాళ్లకు అమ్మినా అదే మినహాయింపును అమలు చేస్తూ రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు నిర్ణయం తీసుకున్నారు.

ఇటీవల క్రెడాయ్ నేతృత్వంలో ప్రభుత్వానికి విజ్ఞప్తి

రియల్ ఎస్టేట్ రంగాన్ని పురోగమింపచేటానికి వీలుగా ఇటీవల కాలంలో క్రెడాయ్ నేతృత్వంలో స్టాంపు డ్యూటీల విషయంలో ప్రభుత్వాన్ని మినహాయింపులు కోరటం జరిగింది. ఈ క్రమంలో రిజిస్ట్రేషన్స్ శాఖ ఇచ్చిన ఆదేశాలు రియల్ ఎస్టేట్ రంగంలో లే అవుట్, భవన నిర్మాణ రంగ ప్రాజెక్టులకు సంబంధించి డెవలప్‌మెంట్ అగ్రిమెంట్స్, సేల్ కమ్ జీపీఏలకు ఎంతో ఊరటను కలిగించనుంది. వాస్తవానికి ఈ రెండు మినహాయింపులు ఇవ్వటం వల్ల రిజిస్ట్రేషన్ శాఖ ఆదాయం మీద ప్రభావం చూపించే అవకాశాలు కూడా ఉన్నాయి. అయినప్పటికీ, స్తబ్దుగా ఉన్న రియల్ ఎస్టేట్ రంగంలో జోష్‌ను నింపటం కోసం ఈ రెండు మినహాయింపులను ఇచ్చారు.

తగ్గేదేలే!

(5వ పేజీ తరువాయి)

నిందలు వేయటం గమనార్హం. స్టాక్‌యార్డు కాంట్రాక్టర్లకు కలెక్టర్ అనుమతి ఉంది. ఈ పాత వైసీపీ నేతకు ఎలాంటి అనుమతి లేకున్నా వారు దొంగతనం చేస్తున్నారు నేను చేస్తా అని బరితెగించటం చూస్తే ఆశ్చర్యంగా ఉంది.

రెల్లి దుబ్బుల్లో ఎక్స్‌కవేటర్‌లు

మంగళవారం క్వారీలోకి రెండు ఎక్స్‌కవేటర్‌లు వచ్చిన విషయాన్ని తహసీల్దార్ ఎం.కుసుమకుమారికి తెలిపితే వీఆర్వో, కానిస్టేబుళ్లను పెట్టానని, ఇంకా తానేమి చేయాలని నిస్సహాయతను వ్యక్తం చేశారు. యంత్రాలను ఎందుకు సీజ్ చేయలేకపోతున్నారని అడగ్గా, ఇసుక తవ్వకాలు జరిపే సమయంలో పట్టుబడితేనే సీజ్ చేయగలమన్నారు. పగలు తవ్వకాలు చేయటం లేదని, అందుచేత యంత్రాలను బయటకు పంపుతున్నామని చెప్పారు. ఆ తరువాత వీఆర్వో శ్రీనివాసరావును పిలిచి క్వారీ వద్దకు పంపించారు. వీఆర్వో వచ్చి రెండు ఎక్స్‌కవేటర్‌లను, లారీలను బయటకు వెళ్లిపోవాలని సూచించారు. అయితే వెనక్కి వచ్చిన ఎక్స్‌కవేటర్‌లను నదీపాయలోనే రెల్లిదుబ్బుల్లోకి తీసుకెళ్లి పెట్టారు. అంటే రాత్రికి తవ్వకాలు చేపట్టేందుకు వీఆర్వోని సైతం లెక్క చేయని పరిస్థితి నెలకొంది. రాత్రికి ఇసుక తవ్వకాలు జరిపితే సీజ్ చేయాల్సి వస్తుందని వీఆర్వో వారికి చెప్పి వచ్చారు.

ముదురుతున్న వివాదం

(5వ పేజీ తరువాయి)

యూనివర్సిటీ వీసీ, రిజిస్ట్రార్‌ల వద్ద స్పష్టం చేశారు. దీంతో ఇంటర్వ్యూలు నిర్వహించేందుకు నియమించిన సబ్జెక్టు నిపుణులు వచ్చి ఖాళీగా కూర్చుని వెళ్లిపోయారు. దీంతో యూనివర్సిటీలో కాంట్రాక్టు అధ్యాపకుల కొనసాగింపు అంశం గందరగోళంగా మారింది. దీంతోపాటు యూనివర్సిటీలో అధ్యాపకుల జీతభత్యాలు, పదోన్నతుల అంశాలను పర్యవేక్షించే రెక్టార్‌కు కనీస సమాచారం ఇవ్వకుండా ఈ ఇంటర్వ్యూల ఆదేశాలు జారీ చేయడం కూడా వివాదాస్పమైంది. దీంతో ఈ విధానంపై రెక్టార్‌కు అండగా యూనివర్సిటీలో పనిచేసే రెగ్యులర్ ప్రొఫెసర్‌లు నిలబడ్డారు.


స్వర్ణభారత్‌ట్రస్ట్‌లో ఏర్పాట్లపై అధికారులకు సూచిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ గీతాంజలిశర్మ, పక్కన ఏఎస్పీ సత్యనారాయణ, వర్సిటీ, జిల్లా అధికారులు

గవర్నర్ పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- ఇన్‌చార్జి కలెక్టర్ గీతాంజలిశర్మ

ఉంగుటూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : గవర్నర్ జిల్లా పర్యటనకు పక్కా ఏర్పాట్లు చేయాలని కృష్ణా జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ అధికారులను ఆదేశించారు. ఆత్కూరు స్వర్ణభారత్‌ట్రస్ట్ (విజయవాడ ఛాప్టర్)లో ఈనెల 24న జరగనున్న ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం(లామ్, గుంటూరు) 57వ స్నాతకోత్సవంలో రాష్ట్ర గవర్నర్, ఎస్.అబ్దుల్ నజీర్ పాల్గొంటున్న నేపథ్యంలో అందుకు సంబంధించిన ఏర్పాట్లను మంగళవారం సాయంత్రం జిల్లా ఏఎస్పీ సత్యనారాయణ, గవర్నర్ ఏడీసీ మేజర్ అమన్ దీప్‌సింగ్, విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామచంద్రరావు, ఇతర అధికారులతో కలిసి గీతాంజలిశర్మ పరిశీలించారు. గవర్నర్ గురువారం ఉదయం స్వర్ణభారత్‌ట్రస్ట్‌లో డిగ్రీలు పూర్తిచేసుకున్న పీజీ, యూజీ విద్యార్థులకు పట్టాలు అందజేస్తారన్నారు. అనంతరం గవర్నర్, ముఖ్య అతిథుల ప్రసంగాలు వుంటాయన్నారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఆయాశాఖల అధికారులకు సూచించారు. కార్యక్రమంలో గుడివాడ ఆర్డీవో జి.బాలసుబ్రహ్మణ్యం, డీఎంహెచ్‌వో డాక్టర్ శర్మిష్ఠ, అగ్నిమాపకశాఖాధికారి యేసురత్నం, సాంఘికసంక్షేమశాఖ అధికారి షేక్ షాహిద్‌బాబు, డీఎస్పీ శ్రీనివాసరావు, ఇతర శాఖల అధికారులు, వ్యవసాయవిశ్వవిద్యాలయం ప్రొఫెసర్లు తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి ఐటీఐలో రెండో విడత కౌన్సెలింగ్

భారతీనగర్, జూలై 22(ఆంధ్రజ్యోతి) : 2025-26/27 విద్యాసంవత్సరానికిగాను జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐ కళాశాలల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి రెండో విడత కౌన్సెలింగ్ బుధవారం నుంచి నిర్వహిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్, కన్వీనర్ ఎం.కనకారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు రెండ్రోజులపాటు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్టు తెలిపారు. బుధవారం ఉదయం 8గంటలకు మెరిట్ నెంబర్ 1 నుంచి 164 వరకు, గ్రేడ్ పాయింట్ 10 నుంచి 5.8వరకు, మధ్యాహ్నం 1గంటకు మెరిట్ 165 నుంచి 337 వరకు, గ్రేడ్ పాయింట్ 5.7 నుంచి 4.7వరకు, గురువారం ఉదయం 8గంటలకు మెరిట్ 338 నుంచి 509 వరకు, గ్రేడ్ పాయింట్ 4.5 నుంచి 3.8వరకు, మధ్యాహ్నం 1గంటకు మెరిట్ 510 నుంచి 650 వరకు, గ్రేడ్ పాయింట్ 3.7 నుంచి దిగువ గ్రేడ్‌పాయింట్ వరకు కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్టు తెలిపారు. అభ్యర్థులు కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, స్టడీసర్టిఫికెట్, అన్ని ఒరిజనల్ సర్టిఫికెట్స్‌తో హాజరుకావాలని తెలిపారు. మరిన్ని వివరాల కోసం 0866-2475575, 9490639639, 7780429468 నెంబర్లలలో సంప్రదించాలని తెలిపారు.

మరిన్ని పాఠశాలలు కేటాయించాలి

వన్‌టౌన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎంఎస్‌హెచ్‌ఆర్ఐ) కింద ఎన్టీఆర్ జిల్లాకు మరిన్ని పాఠశాలలు కేటాయించాలని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) లోక్‌సభలో మంగళవారం ప్రస్తావించారు. రెండు దశలలో జిల్లాలో మొత్తం 827 పాఠశాలలను ఎంపిక చేసేందుకు నిర్ణయించినప్పటికీ వాటిలో 550 పాఠశాలలు అర్హత ప్రమాణాలను సూచించినప్పటికీ కేవలం 27 పాఠశాలలకు మాత్రమే మంజూరు లభించిందని ఆయన ప్రస్తావించారు. ఎంపిక శాతం కేవలం 4.9 శాతం మాత్రమే ఉండటం శోచనీయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 62 పాఠశాలలను ఎంపిక చేసి కేంద్రానికి పంపించారని, అయితే వాటిలో 56 శాతం పైగా పాఠశాలలు తుది జాబితాలో లేకపోవటం బాధాకరమని ఆయన పేర్కొన్నారు. ఎంపిక ప్రక్రియను పునఃసమీక్షించి మరిన్ని పాఠశాలలకు పీఎంఎస్‌హెచ్‌ఆర్ఐ కింద మంజూరు చేయాలని కోరారు.

అర్హులకు నియామక పత్రాలు జారీ

మచిలీపట్నం టౌన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం పింగళి వెంకయ్య మెడికల్ కళాశాలలో దరఖాస్తు చేసుకున్న మెడికల్ ఫిజిష్టు, రేడియాలజీ ఫిజిష్టు, సిటీ టెక్నీషియన్, క్లినిక్ ఫార్మాసిస్టు, ఓటి టెక్నీషియన్, ఫిజియోథెరపిస్టు, ఇఐజీ టెక్నీషియన్, జూనియర్ అసిస్టెంట్, అటెండర్, ఎలక్ట్రీషియన్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు మంగళవారం నియామక పత్రాలు అందజేశారు. 2024 డిసెంబర్‌లో 142 పోస్టులకు 7900 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో అర్హులను గుర్తించి రోస్టర్ ప్రకారం నియామక పత్రాలు అందజేస్తున్నారు. మెడికల్ కళాశాలలో 45 మంది, జిల్లా ప్రభుత్వ సరజన ఆసుపత్రిలో 48, నర్సింగ్ కళాశాలలో 8 మందికి నియామక పత్రాలు ఇవ్వాల్సి ఉంది. 101 మందికి గాను 88 మంది అర్హత సాధించారు.

29న దసరా ఉత్సవాలపై సమన్వయ సమావేశం

ఇంద్రకీలాద్రి : ఇంద్రకీలాద్రి, దుర్గామల్లేశ్వర దేవస్థానంలో సెప్టెంబరు 22 నుంచి అక్టోబరు 2 వరకు దసరా మహోత్సవాల నిర్వహణపై ఈనెల 29న కలెక్టర్ ఆధ్వర్యంలో వివిధ శాఖల సమన్వయ సమావేశం జరుగుతుందని జిల్లా కలెక్టర్ తరఫున డీఆర్వో మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశానికి సంబంధిత విభాగాల అధికారులు పాల్గొనాలన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	232
చికెన్ స్కిన్‌లెస్	242

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 505

ప్రతిరైతు పంట బీమా చేయించుకోవాలి



కంకిపాడు, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : విపత్తుల సమయంలో రైతులు నష్టపోకుండా ప్రతి ఒక్కరూ పంట బీమా చేయించుకోవాలని జిల్లా వనరుల ఏడీఏ కొర్రపాటి శ్రీనివాస రావు అన్నారు. ఉప్పలూరులో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రైతులు వరి పంట సాగు సమయంలో యాజమాన్య పద్ధతులను పాటించాలన్నారు. ఉప్పలూరు పీఏసీఎస్ చైర్మన్ పడవల మధుసూదనరావు పాల్గొన్నారు.

టిడ్కో లబ్ధిదారులకు శాపం

వైసీపీ పాలకుల నిర్వాకం..

సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్





ఉయ్యూరు 9వ వార్డులో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్, వైవీబీ రాజేంద్రప్రసాద్.. సాయిపురంలో దండమూడి చౌదరి

ఉయ్యూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : పట్టణ ప్రాంతాల్లో టీడీపీ ప్రభుత్వం ప్రారంభించిన టిడ్కో ఇళ్ల నిర్మాణం వైసీపీ పాలకుల నిర్వాకం వల్ల లబ్ధిదారులకు శాపంగా మారిందని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ఆరోపించారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఉయ్యూరు 7, 9 వార్డులలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్, ఉయ్యూరు చైర్మన్ వి.సత్యనారాయణతో కలిసి పర్యటించి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వివరించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వ పాలన పట్ల ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని, ప్రజలు టిడ్కో ఇళ్ల గురించి అడుగుతున్నారని, టీడీపీ ప్రభుత్వం టిడ్కో ఇళ్ల నిర్మాణం ప్రారంభించి 80 శాతంకుపైగా పూర్తి చేయగా తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ టిడ్కో ఇళ్లపై బ్యాంకుల నుంచి లబ్ధిదారుల పేరిట రుణాలు తీసుకుని సొంత, ప్రభుత్వ ఖజానాకు మళ్లించుకుని నిర్మాణం పూర్తిచేయకుండా నిర్లక్ష్యం చేసిందన్నారు. చంద్రబాబు చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాల పట్ల ప్రజలు సంతృప్తితో ఉన్నారని, ముఖ్యమంత్రికి అండగా నిలుస్తామంటున్నారని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైవీబీ రాజేంద్ర ప్రసాద్ అన్నారు. పీఏసీఎస్ అధ్యక్షుడు కూనపరెడ్డి వాసు, పట్టణ పార్టీ అధ్యక్షుడు గుర్నాధరావు, మాజీ సర్పంచ్‌లు పూర్ణచంద్రరావు, ఖుద్దూస్, పార్టీ నాయకులు అల్‌రియాజ్, చిరంజీవి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

శాయిపురం, జబర్లపూడిలో..

తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు దండమూడి చౌదరి ఆధ్వర్యంలో సాయిపురం, జబర్లపూడిలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించి సూపర్‌సిక్స్ సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించారు. వైసీపీ అధికారంలో ఉండగా వ్యవసాయాన్ని నిర్లక్ష్యం చేసిందని, పంటకాల్వలు, మురుగుకాల్వల నిర్వహణ చేపట్టకపోవడంతో పలు గ్రామాల పరిధిలో వర్షాలకు వరినాట్లు ముంపుకు గురయ్యాయని ఆరోపించారు. సాయిపురం సర్పంచ్ జాన్ బాషా, పీఏసీఎస్ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, వెంకటేశ్వర్లు, జ్ఞానశేఖర్ తదితర నాయకులు పాల్గొన్నారు.



తాడిగడపలో యార్లగడ్డ సుచిత్ర..

తాడిగడప 38వ డివిజన్‌లో..

పెనమలూరు : సైకో జగన్‌రెడ్డి పాలనలో భయంతో బీతిల్లిన రాష్ట్ర ప్రజలు స్వేచ్ఛావాయువులు పీల్చుకుంటున్నారని, కూటమి పాలనలోనే రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనిస్తోందని తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి యార్లగడ్డ సుచిత్ర పేర్కొన్నారు. తాడిగడప మునిసిపాలిటీ 38వ డివిజన్‌లో మంగళవారం జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆమె పాల్గొని స్థానికులతో మాట్లాడారు. ఏడాది పాలనలో జరిగిన అభివృద్ధిని వివరించే కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దోనేపూడి రవికిరణ్, ఆరేపల్లి విజయ్, రషీద్ తదితరులు పాల్గొన్నారు.



యనమలకుదురులో..

యనమలకుదురులో..

యనమలకుదురులోజరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో టీడీపీ నాయకులు శొంఠి శివ రాంప్రసాద్, మొక్కపాటి శ్రీనివాస్‌లు స్థానిక నాయకులతో కలిసి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకొన్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధిని వివరించే కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తాడిశెట్టి వీరాస్వామి, బూక్య రాజా, చిర్రావూరి శేషు, ధనేకుల షణ్ముఖరావు, సజ్జ ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

సుపరిపాలనతోనే గ్రామీణాభివృద్ధి

హనుమాన్‌జంక్షన్‌రూరల్: రేమల్లెలో మంగళవారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్ర మం లో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో కూడిన కరపత్రాలను టీడీపీ గ్రామాధ్యక్షుడు కొల్లూరి చంద్రకాంత్ పంపిణీ చేశారు. కార్యదర్శి ఈడే నారాయణ, కలపాల రాధాకృష్ణమూర్తి, లింగవరపు లోకేష్, క్లస్టర్ ఇన్‌చార్జి కలపాల కుమార్, గుడివాడ విజయానంద్ పాల్గొన్నారు.



రేమల్లెలో..

విద్యుత్ వినియోగదారుల

సమస్యల పరిష్కారమే లక్ష్యం

హనుమాన్‌జంక్షన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ వినియోగదారుల సమస్యలను సత్వరమే పరిష్కరించడానికి విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కార వేదిక (సీజీఆర్ఎఫ్) పనిచేస్తోందని ఆ వేదిక చైర్‌పర్సన్, మాజీ జిల్లా సెషన్స్ జడ్జి ఎన్. విక్టర్ ఇమ్మానుయేల్ తెలిపారు. మంగళవారం స్థానిక ఎస్ఆర్ కన్వెన్షన్‌లో ఏపీసీపీడీసీఎల్ ఎస్ఈ ఎం.సత్యానందం ఆధ్వర్యంలో గుడివాడ డివిజన్ పరిధిలో అదాలత్, అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్ఈ ఎం. సత్యానందనం, గుడివాడ ఈఈ జీబీ శ్రీనివాస రావు జంక్షన్ సబ్ డివిజన్ డీఈఈ బి.శ్రీనివాసరావు, పలు సబ్ డివిజన్‌ల ఈఈలు, ఏఈలు పాల్గొన్నారు.

తొమ్మిది మందిపై కేసు నమోదు

పెనమలూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : తాడిగడపలో వివాదంలో ఉన్న భూమిలోకి ప్రవేశించడానికి ప్రయత్నిస్తున్న వ్యక్తులను అడ్డుకొన్న ప్రభుత్వ అధికారులను బెదిరించిన తొమ్మిది మందిపై తహశీల్దారు గోపాలకృష్ణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. తాడిగడపలోని సర్వే నంబరు 176లోని భూమి రాష్ట్ర వక్ఫ్ బోర్డు పరిపాలనలో ఉన్న కొండపల్లి ఖాజీ సర్వీస్‌కు చెందింది. లీజు పెండింగ్‌లో ఉన్నప్పటికీ మంగళవారం తొమ్మిది మంది అక్రమంగా భూమిలోకి ప్రవేశించి దౌర్జన్యం చేశారు.



మాట్లాడుతున్న ఎస్సై శ్రీధర్

ఫోక్సో చట్టంపై అవగాహన

గన్నవరం, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : ఫోక్సో కేసులో ఇరుక్కుంటే ఆరేళ్ల జైలు శిక్షతో పాటు సస్పెక్ట్ షీట్ తెరుస్తారని ఎస్సై శ్రీధర్ తెలిపారు. స్థానిక వీకేఆర్ కళాశాలలో ఫోక్సో చట్టంపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై శ్రీధర్ మాట్లాడుతూ, ఫోక్సో కేసులో అరెస్టు అయితే 5 నెలల పాటు బెయిల్ కూడా రాదన్నారు. ఆడపిల్లల జోలికి వెళ్ల కూడదని చెప్పారు. అందరూ సోదరభావంతో కలసి మెలసి ఉండాలని, అప్పుడే మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

బాపులపాడు జడ్పీ హైస్కూల్‌లో..

హనుమాన్‌జంక్షన్ : చదువులో ఉత్తమ ఫలితాలు సాధిస్తూ సత్ప్రవర్తనతో భవిష్యత్తుకు బంగా రు బాటలు వేసుకోవాలని ఎస్సై వి.సురేష్ తెలిపారు. మంగళవారం బాపులపాడు జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు ఫోక్సో చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థినులకు బ్యాడ్ టచ్, గుడ్ టచ్‌పై వివరించారు. సెల్‌ఫోన్‌కు, వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. హెచ్‌ఎం ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రోజా వ్యాఖ్యలు సిగ్గుచేటు

ఈడుపుగల్లు సర్పంచ్ ఇందిర

కంకిపాడు, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : మాజీ మంత్రి, వైసీపీ నాయకురాలు రోజా మాట్లాడే తీరు సిగ్గుచేటని ఈడుపుగల్లు సర్పంచ్ పందిపాటి ఇందిర అన్నారు. స్థానిక విలేకరులతో మంగళవారం ఆమె మాట్లాడుతూ, రాష్ట్రంలో గెలిచిన తెలుగుదేశం ఎమ్మెల్యేలపై అనుచిత వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమన్నారు. రాజకీయాలు హుందాగా ఉండాలే తప్ప ఈ విధమైన మాటలేంటన్నారు. గత వైసీపీ ప్రభుత్వం పనితీరు చూసిన ప్రజలు 151 సీట్ల నుంచి 11 సీట్లకు పడేసినా ఇంకా వైసీపీ నాయకులు సిగ్గు రాలేదన్నారు. మద్యం కుంభకో ణంలో వైసీపీ నాయకులు జైలుకు వెళ్తున్నారని, రానున్న రోజుల్లో జగన్ జైలుకెళ్లడం తథ్యమన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఐఐటీ విద్యార్థిని హారికకు ప్రోత్సాహ బహుమతి

ఉయ్యూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : ఐఐటీ విద్యార్థిని తుమ్మలచర్ల హారికను పద్మశాలీయ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సత్కరించి ప్రోత్సాహక బహుమతి అందజేశారు. ఉయ్యూరుకు చెందిన హారిక పదవ తరగతిలో 589 మార్కులు, ఇంటర్‌లో 989 మార్కులతో టౌన్ ఫస్ట్‌గా నిలిచి ఏపీ ఆర్జేసీలో స్టేట్ రెండవ ర్యాంకు, జేఈఈ మెయిన్స్ మొదటి ప్రయత్నంలో 99.93, రెండవ ప్రయత్నంలో 99.97, అడ్వాన్స్ బీసీలో 176, ఓపెన్ కేటగిరిలో 1071 ర్యాంకు, ఎంసెట్‌లో 139 ర్యాంకు సాధించి, చెన్నై ఐఐటీలో సీటు సాధించింది. సంఘ నాయకులు మూర్తి, బోస్, తులసీరామ్, ఆకునూరు సర్పంచ్ గోలి వసంతకుమార్, దిలీప్ తదితరులు హారికను ఆశీర్వదించారు.



లయనిజంతో విస్తృత సేవలు



హనుమాన్‌జంక్షన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ వ్యాప్తంగా అనేక సేవా కార్యక్రమాలు అందిస్తున్న లయన్స్ క్లబ్ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో సేవలను మరింత విస్తృతం చేయాలని లయన్స్ పాస్ట్ మల్టిపుల్ కౌన్సిల్ చైర్మన్ లింగం శివశంకర్ అన్నారు. సోమవారం రాత్రి స్థానిక లయన్స్ క్లబ్‌లో లయన్స్ క్లబ్ ఆఫ్ హనుమాన్‌జంక్షన్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారోత్సవం ఘనంగా నిర్వహించారు. నూతన కార్యవర్గంలో అధ్యక్షుడిగా స్థానిక మెడివ్యాలీ హాస్పిటల్ ఎండీ పంచకర్ల రమేశ్ చక్రవర్తి, కార్యదర్శిగా మాకినేని శ్రీనివాసరావు, కోశాధికారిగా అక్కినేని రాఘవేంద్రరావు మరికొంత మంది కార్యవర్గ సభ్యులు చేత పూర్వపు జిల్లా గవర్నర్ మిరియాల వెంకటేశ్వరరావు ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో లయన్స్ మాజీ గవర్నర్లు జెఎస్.శంకర్, వైసీపీ గుప్తా, గద్దె శేషగిరి, వీరమాచనేని రామబ్రహ్మం, వైస్ గవర్నర్ శ్రీనివాసరెడ్డి, లయన్స్ నాయకులు మద్దినేని చక్రధర్, ముత్యప్రసాద్, దుట్టా శ్రీనివాస్, కొల్లి రామకృష్ణప్రసాద్, జాన్‌బాబు, భానుసుం దర్‌కుమార్, గాజుల రామారావు, దయాల రాజేశ్వరరావు, మూల్పూరి సాయి కల్యాణి, వీరమాచనేని సత్యప్రసాద్ పాల్గొన్నారు.

బాలుడి వైద్యఖర్చులకు ఆర్థిక సాయం



ఉంగుటూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి దశనుంచే ప్రతి ఒక్కరూ సేవాగుణం అలవర్చుకోవాలని, ఆపదలో వున్నవారిపట్ల మానవత్వంతో స్పందించి చేతనైనంత సాయం అందించాలని తేలప్రోలు ఉషారామా ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ జీవీకేఎస్‌వీ ప్రసాద్ అన్నారు. భీమవరానికి చెందిన కాసరపు దుర్గాప్రసాద్, సంధ్యల కుమారుడు కే.విహంత్ అర్జున్ బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతూ విజయవాడలోని రెయిన్‌బో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాలుడి వైద్యఖర్చుల నిమిత్తం కళాశాలలోని ఎన్ఎస్ఎస్ విభాగం విద్యార్థులు సేకరించిన రూ.42,100ల నగదును మంగళవారం ఆసుపత్రిలో చిన్నారి తల్లిదండ్రులకు అందజేశారు. కళాశాల చైర్మన్ సుంకర రామబ్రహ్మం పాల్గొన్నారు.

పేదలకు సీఎం సహాయనిధి సంజీవని



పెనమలూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : ఖర్చుతో కూడుకున్న ఆరోగ్యబీమా పాలసీలు అందుబాటులో లేని పేదలు, బడుగులకు ముఖ్యమంత్రి సహాయనిధి సంజీవని లాంటిదని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. మంగళవారం పోరంకి టీడీపీ కార్యాలయంలో టీడీపీ కూటమి నాయకులతో కలిసి ఏభై మంది బాధితులకు రూ. 35లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కూటమి నేతలు అనుమోలు ప్రభాకరరావు, మారుపూడి ధనకోటేశ్వరరావు, కోయ ఆనంద్‌ప్రసాద్, యార్లగడ్డ సుచిత్ర, కొండా ప్రవీణ్, అన్నే ధనయ్య, తాతపూడి గణేష్, మొక్కపాటి శ్రీనివాస్, బీజేపీ శ్రీనివాస్, బీజేపీ యేకుల విజయేంద్ర, మల్లేశ్వరరావు, జంపాన గుర్నాధం, వెనిగళ్ల కుటుంబరావు, వేమూరి శ్రీనివాస్, కోడె అనిల్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నటరాజ పూజా దినోత్సవం



కానూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లా సంస్కార భారతి ఆధ్వర్యంలో కానూరులోని వేణుగోపాల స్వామి ఆలయంలో మంగళవారం నటరాజ పూజా దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో సంస్కార భారతి సభ్యుడు జ్యోతి ప్రజ్వలన చేశారు. చిన్నారుల భగవద్గీత, సాంస్కృతిక కార్యక్రమం అర్చకుల వేద మంత్రాల నడుమ సాగింది. చిన్నారులకు సర్టిఫికెట్‌లు అందజేశారు. వేదపండితులు, మహా ఉపాధ్యాయులు పరాశరం వెంకటరమణాచార్యులు వేద వాక్యాలను తెలియజేశారు. కార్యక్రమంలో సంస్కార భారతి జిల్లా శాఖ కార్యదర్శి విద్యాధరి, ప్రతినిధులు జ్యోతి, సీత, కృష్ణవేణి, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కానూరులో జాతీయ జెండా దత్తత దినోత్సవం

కానూరులోని అశోక్ జిమ్‌లో మంగళవారం జాతీయ జండా దత్తత దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో గన్నవరం ట్రాఫిక్ సీఐ పెద్దిరాజు, జిమ్ నిర్వాహకుడు తాళ్లూరి అశోక్, జిల్లా యువజన సర్వీస్‌లశాఖ ప్రతినిధి రఘురామ్, పి. నాగేశ్వరరావుతోపాటు బాడీ బిల్డింగ్ క్రీడాకారులు, మాతృ హృదయ్ సేవా సంఘ్ సభ్యులు పాల్గొన్నారు.

డ్రెయిన్ల పూడికతీత పనుల పరిశీలన

పెనమలూరు / కానూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : అధిక వర్షాల కారణంగా నిండిపోయి ముందుకు సాగకుండా పొలాల్లోకి, అపార్టుమెంటు మధ్యలోకి వెళ్లి నిలుస్తున్న నీటిని బయటికి పంపేందుకు చేపట్టిన డ్రెయిన్ల పూడికతీత పనులను ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మునిసిపల్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ నాయకులు అనుమోలు ప్రభాకరరావు, కమిషనర్ షేక్ నజీర్, మునిసిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు ఉన్నారు.

● తాడిగడప మునిసిపాలిటీ కానూరు మెయిన్ రోడ్డులోని డ్రెయిన్‌లో చెత్తాచెదారం పేరుకుపోయి మురుగు ముందు వెళ్లక రోడ్డుపైకి వచ్చి ప్రజలు పడుతున్న ఇబ్బందులను తొలగించేందుకు మంగళవారం ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ప్రొక్లైనర్‌ను తెప్పించి కాలువలోని పూడికను తీయించారు.

ఘనంగా సత్యనారాయణస్వామి వ్రతం

హనుమాన్‌జంక్షన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : స్థానిక నూజివీడు రోడ్డులోని లక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో మంగళవారం సామూహిక రమా సత్యనారాయణ స్వామి వ్రతం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు సీతారామాచార్యులు వ్రతం జరిపారు. వ్రతంలో పాల్గొన్న భక్తులకు ఆలయ ట్రస్టీ కాకాని వెంకటేశ్వరరావు, అరుణ దంపతులు పూజా సామాగ్రిని అందజేశారు.

ప్రతి ఒక్కరూ ధ్యానం చేయాలి

గన్నవరం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దావాజీగూడెం సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో మంగళవారం బ్రహ్మర్షి పితామహ ప్రతీజీ దివ్యస్ఫూర్తితో ధ్యాన శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా సరస్వతీ పిరమిడ్ ధ్యాన కేంద్రం నిర్వాహకురాలు ఎం.నాగరమాదేవి శ్వాస మీద ధ్యానం శిక్షణను ఆరోగ్యవంతమైన జీవనం కోసం ప్రతి ఒక్కరు ధ్యానం చేయాలన్నారు. దీని వలన దీర్ఘకాల వ్యాధులను పారదోలవచ్చన్నారు. అర్చకులు రామాచార్యులు పాల్గొన్నారు.

కేరళ మాజీ సీఎం అచ్చుతానందన్‌కు ఘన నివాళి

కంకిపాడు, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : కేరళ మాజీ సీఎం అచ్యుతానందన్ మృతి సీపీఎంతో పాటు దేశానికి తీరనిలోటు అని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు పంచకర్ల రంగా రావు అన్నారు. స్థానిక మండేపూడి నాగభూషణ్ రెడ్డి భవన్‌లో మంగళవారం మాజీ సీఎం అచ్యుతానందన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి తాడంకి నరేష్, సభ్యులు శివ శంకర్, జి. కుమారి, సీహెచ్ శ్రీహరి, వి. జాన్‌మోజస్, వి. నాగేశ్వరరావు, జి. రవికుమార్, సీహెచ్ రెడ్డయ్య పాల్గొన్నారు.

జిల్లా జడ్జి దృష్టికి ఉయ్యూరు కోర్టు సమస్య

ఉయ్యూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : ఉయ్యూరు బార్ అసోసియేషన్ సభ్యులు మంగళవారం జిల్లా జడ్జి జ.గోపీని మర్యాద పూర్వకంగా కలసి ఉయ్యూరు కోర్టు సమస్యలు, కోర్టుకు అవసరమైన స్థలం సమస్య తెలియజేసినట్టు అసోసియేషన్ అధ్యక్షుడు కాగిత గోపీచంద్ తెలిపారు. మచిలీపట్నంలో జిల్లా జడ్జిని కలసి కోర్టు సమస్యల గురించి ప్రస్తావించి, కోర్టు భవన నిర్మాణానికి అవసరమైన స్థలం సమస్య తెలియజేయగా ఆయన సానుకూలంగా స్పందించినట్టు తెలిపారు. అసోసియేషన్ వైస్ ప్రసిడెంట్ పల్లి అశోక్, సభ్యులు మాదల ప్రసాద్, ప్రతాప్‌రెడ్డి, శ్రీరామ్, సూర్యనారాయణ ఇతర న్యాయవాదులు జడ్జిని కలసిన వారిలో ఉన్నారు.

అసత్య ఆరోపణలు మానుకోవాలి: కొండా

ఉయ్యూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : కూటమి నాయకులపై పిచ్చిపిచ్చి ఆరోపణలు, అసత్య ప్రచారం మానుకోవాలని వైసీపీ నాయకులను కూటమి నాయకులు హెచ్చరించారు. ఎమ్మెల్యే బోడె ప్రసాద్, టీడీపీ నాయకులపై వైసీపీ నాయకులు దేవభక్తుని చక్రవర్తి, పాలడుగు శివజ్యోతి చేసిన అర్థంలేని ఆరోపణలు, జుగుప్సాకర వ్యాఖ్యలను వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయ ఆవరణలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కూటమి నాయకులు ఖండించారు. వైసీపీ నాయకులు నోటిని అదుపులో పెట్టుకోవాలని, పిచ్చిప్రే లాపనలు కట్టిపెట్టాలని ఏఎంసీ చైర్మన్ కొండా ప్రవీణ్ హెచ్చరించారు.

● రోడ్డుపైనే నీరు..



కానూరు వెళ్లే ప్రధాన రోడ్డులో కెనడీ స్కూల్ వద్ద వర్షం కారణంగా రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు.. అవస్థలు పడుతున్న ప్రజలు

నగరవనం.. పచ్చదనం

నయనానందకరం.. పర్యాటకుల స్వర్గధామం.. ప్రకృతి సోయగాల సమాహారం.. నగరవనం. కను విందు చేసే పూలమొక్కలతో పచ్చందాలు పరుచుకుని సరికొత్తగా ముస్తాబైన సీతాకోక చిలుకల పార్కుతో నగరవనం కొత్తందాలను పరచుకుంది. తొలకరి వర్షాలతో సుమనోహరంగా కనిపిస్తోంది. పర్యాటకులను రా.. రమ్మని పిలుస్తోంది. కొండపల్లి రిజర్వు ఫారెస్టుకే మణిహారంగా ఈ మూలపాడు నగరవనం నిలుస్తోంది.

- ఆంధ్రజ్యోతి, విజయవాడ



రా.. రమ్మని ! కొత్త అందాలతో అలరిస్తున్న సీతాకోక చిలుకల పార్క్

- ప్రత్యేక ఆకర్షణగా నెమలి బొమ్మ
- సుందరీకరణతో ఆకట్టుకుంటున్న అందాలు

కొత్త అందాలతో కొంగొత్త ఆకర్షణలతో మూలపాడు నగరవనం పర్యాటకులను రా రమ్మంటూ ఆహ్వానిస్తోంది. పర్యాటక, అటవీ శాఖ అధికారులు నగరవనాన్ని రోజుకు రోజురూ మరింత సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. నగరవనం మెయిన్ గేటు అందం పర్యాటకులను అబ్బుర పరుస్తోంది. దారి పొడవున సీతాకోక చిలుకల కోసం పెట్టిన పలురకాల పూలమొక్కలు వికసించి రహదారికే అందాన్ని అద్దుతున్నాయి. అర కిలో మీటర్ దూరంలో ఏర్పాటు చేసిన రెండో గేటు సైతం ఆకట్టుకుంటోంది. అక్కడ ఏర్పాటు చేసిన నెమలి బొమ్మ పార్కుకే అందాన్ని తీసుకొచ్చింది. ప్రత్యేక ఆకర్షణగా జీవం ఉట్టిపడేలా నెమలి బొమ్మను తీర్చిదిద్దారు. పూలమొక్కల మధ్య ఏర్పాటు చేసి పూరి గుడిసె లాంటి ఇల్లు పార్కుకు అలంకారంగా మారింది. మరోపక్క నేరేడు వనం మధ్యలో ఏర్పాటు చేసిన సైక్లింగ్ ట్రాక్ ఆకట్టుకుంటోంది. అక్కడి నుంచి కాస్త ముందుకెళితే పార్క్‌లో పిల్లలు, పెద్దలు ఆడుకునేందుకు ఆట వస్తువులున్నాయి. ఇంకాస్త ముందుకు వెళితే కళ్లు తిప్పుకోలేకుండా చూడాలనిపించే వెదురు వనం ఉంది. ఇలా అడుగడుగునా అందాలతో అలరిస్తూ నగరవనం మంచి పర్యాటక ప్రాంతంగా దినదినాభివృద్ధి చెందుతోంది. ప్రతి రోజు వందల సంఖ్యలో పర్యాటకులు నగరవనానికి క్యూ కడుతున్నారు. ఆదివారాల్లో అయితే సుమారు 500 మందికిపైగా పర్యాటకులు నగరవనాన్ని సందర్శిస్తున్నారు.



మూలపాడు నగరవనం రెండో గేటు



దారి పొడవునా సీతాకోక చిలుకల కోసం ఏర్పాటు చేసిన పూల చెట్లు



భారీ వర్షాలు.. అప్రమత్తంగా ఉండాలి

- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ
- కలెక్టరేట్‌లో 9154970454 నెంబరుతో కంట్రోల్ రూం

కలెక్టరేట్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నిరంతరం కురుస్తున్న వర్షాల నేపథ్యంలో వివిధ శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నందున అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. ఇప్పటికే రాష్ట్ర విపత్తు స్పందన దళం (ఎన్‌డీఆర్ఎఫ్) బృందం నగరంలో అందుబాటులో ఉన్నట్టు తెలిపారు. కలెక్టరేట్‌లో 24 గంటలూ పనిచేసే 9154970454 నెంబరుతో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. వర్షాలు, గాలుల సమయంలో భారీ హోర్డింగ్‌లు, చెట్ల కింద, శిథిలావస్థలో ఉన్న భవనాల వద్ద ఉండకూడదన్నారు. ఎలాంటి ప్రాణ, పశు, పంట నష్టం జరుగకుండా పటిష్ఠమైన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రోడ్లపై నీళ్లు నిలవకుండా, చెట్లు పడిపోతే వెంటనే తొలగించేలా క్షేత్రస్థాయి సిబ్బందితో సమన్వయం చేసుకోవాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు.



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ ఇలక్కియా

ఆక్రమణల తొలగింపునకు ప్రత్యేక కార్యాచరణ

- జాయింట్ కలెక్టర్ ఇలక్కియా

కలెక్టరేట్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కాల్వలు, చెరువుల వెంబడి ఆక్రమణలను గుర్తించి, తొలగించేందుకు కార్యాచరణ రూపొందించాలని జాయింట్ కలెక్టర్ ఎస్ ఇలక్కియా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని జాయింట్ కలెక్టర్ చాంబర్‌లో మంగళవారం జేసీ, జిల్లా వాచ్‌డాగ్ కమిటీ కన్వీనర్ ఎస్ ఇలక్కియ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జీవో నెం.386లో నిర్దేశించినట్టు నీటి వనరులు, చెరువుల బెడ్‌లను ఆక్రమణల నుంచి రక్షించేందుకు జిల్లాస్థాయి వాచ్‌డాగ్ కమిటీని ఏర్పాటు చేశామన్నారు. ఈ కమిటీ జిల్లాలోని నీటి వనరులు, ట్యాంక్ బెడ్‌లను గుర్తించి వాటి స్థితిని ప్రతినెల సమీక్షించి, ప్రభుత్వానికి త్రైమాసిక నివేదిక సమర్పించాల్సి ఉంటుందన్నారు. జిల్లాలోని కాల్వలు, చెరువులు వెంబడి ఆక్రమణల ద్వారా ఏర్పాటు చేసుకొన్న శాశ్వత/తాత్కాలిక నిర్మాణాలను గుర్తించి, జాబితా రూపొందించాలని ఆదేశించారు. ప్రతినెలా నిర్ణీత సమయంలో కమిటీ సమావేశమై ఆక్రమణల గుర్తింపుతో పాటు తొలగింపునకు కార్యాచరణ చేపట్టాల్సిందిగా నిర్ణయించినట్టు పేర్కొన్నారు. ఇరిగేషన్ ఎస్ఈ ఎంఆర్‌మొహిద్దీన్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ శ్రీనివాస్, వీఎంసీ సిటీ ప్లానర్ సంధ్య రత్నకుమార్, కమిటీ సభ్యులు ఉన్నారు.



మాట్లాడుతున్న ఆదాయ పన్ను శాఖ డిప్యూటీ కమిషనర్ సవీష్‌వర్మ

ఆదాయ పన్ను చెల్లింపు ప్రతి ఒక్కరి బాధ్యత

- ఇన్‌కం ట్యాక్స్ డిప్యూటీ కమిషనర్ సవీష్ వర్మ

విజయవాడ సిటీ, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఆదాయ పన్ను చెల్లింపు ప్రతి ఒక్కరి వ్యక్తిగత ఆర్థిక బాధ్యత అని ఆదాయ పన్ను శాఖ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ వీ సవీష్‌వర్మ సూచించారు. విజయవాడలోని విద్యుత్ సౌధలో విద్యుత్ ఉద్యోగులకు ఇన్‌కం ట్యాక్స్ ఫైలింగ్‌పై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సవీష్ వర్మ మాట్లాడుతూ ఏపీ ట్రాన్స్‌కోకు సంబంధించి సెక్షన్ 192, 194సీ, 194ఐ, 194జే, 194క్యూ తదితర ముఖ్యమైన టీడీఎస్ నిబంధనలు ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వచ్చాయన్నారు. ఉద్యోగులు తప్పకుండా ఇన్‌కం ట్యాక్స్ ఫైలింగ్ చేస్తే సంస్థకు సమగ్ర ప్రయోజనం కలుగుతుందన్నారు. ఇన్‌కం ట్యాక్స్ డిప్యూటీ కమిషనర్ ప్రమకుమార్, ఏపీ ట్రాన్స్‌కో డైరెక్టర్ ఎస్ వీ రమణమూర్తి, ఎఫ్ఏ, సీసీఏ వీడీ సర్వేశ్వరరావు, డెప్యూటీ సీసీఏ బీ నాగరాజు, వీవీకే శర్మ పాల్గొన్నారు.

జేసీ ప్రభాకర్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలి

- ఏపీ జేఏసీ అమరావతి డిమాండ్

గాంధీనగర్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఇటీవల అనంతపురం జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో) టి.నాగరాజు నాయుడుపై తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను ఏపీ జేఏసీ అమరావతి తీవ్రంగా ఖండించింది. ఉద్యోగుల మనోభావాలను కించపరిచేలా, వారిని భయభ్రాంతులకు గురిచేసేలా వ్యాఖ్యలు చేసిన ఆయనపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని జేఏసీ చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, స్టేట్ సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదరరావు మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉద్యోగులకు సహకరించాల్సిన ప్రజాప్రతినిధులే ఉద్యోగుల మనోభావాలు కించపరిచేలా వ్యాఖ్యలు చేయడం, దాడులకు సిద్ధపడటం తగదని హితవు పలికారు. సీఎం చంద్రబాబు తక్షణమే స్పందించి ప్రభాకర్‌రెడ్డిపై చర్యలు తీసుకుని రాష్ట్ర ప్రభుత్వ సిబ్బంది, అధికారులకు భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు.

శ్రీనిధి స్వాహా

- నిలదీసినందుకు స్లీపింగ్ ట్యాబ్లెట్స్ వేసుకున్న బుక్‌కీపర్
- న్యాయం చేయాలని పోలీసులను ఆశ్రయించిన గ్రూపు సభ్యులు
- గ్రామ పెద్ద వేధింపులతోనే ఆత్మహత్యాయత్నం: బుక్‌కీపర్ సుమ

ఇబ్రహీంపట్నం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): చిలుకూరు గ్రామానికి చెందిన బుక్ కీపర్ కంద్రు సుమ శ్రీనిధి నుంచి రూ.11.10 లక్షల నిధులు గోల్‌మాల్ చేసిందని ఈ నిధుల స్వాహా విషయం తెలిసి నిలదీస్తే నిద్రమాత్రలు మింగి గ్రామానికి చెందిన ఓ పెద్ద మనిషి తనను వేధిస్తున్నాడని ఆరోపిస్తోందని, ఆమె నుంచి తాము శ్రీనిధిలో దాచుకున్న సొమ్ములు ఇప్పించాలని 13 డ్వాక్రాగ్రూపుల సభ్యులు మంగళవారం ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేశారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాను చేసిన తప్పును కప్పిపుచ్చుకునేందుకు, అసలు నిజాన్ని పక్కదారి పట్టించేందుకు గ్రామానికే చెందిన కట్టేపల్లి సుబ్బారావు అనే పెద్ద ఏడాది నుంచి వేధిస్తున్నాడని ఆరోపిస్తూ సెల్ఫీ వీడియో సోషల్ మీడియాలో పెట్టిందని గ్రూపు సభ్యులు ఆరోపించారు. తమకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని గ్రూప్ సభ్యులు చెప్పారు. ఇదిలా తనను గ్రామానికి చెందిన కట్టేపల్లి సుబ్బారావు వేధిస్తున్నాడని బుక్ కీపర్ సుమ ఈనెల 19న స్లీపింగ్ ట్యాబ్లెట్ మింగి ఆసుపత్రిలో చేరింది. చికిత్స పొంది మంగళవారం ఇంటికి తిరిగి వచ్చింది. మళ్లీ మరోమారు వాంతులవడంతో తిరిగి ఆసుపత్రికి వెళ్లినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.



పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న గ్రూప్ సభ్యులు

బుక్‌కీపర్ సుమపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో గతంలో ఒకసారి ఆమెపై విచారణ జరిగిందని, కొంత రికవరీ జరగ్గా ఇంకా విచారణ పూర్తి కాలేదని ఏపీఎం శోభనబాబు తెలిపారు. విచారణ పూర్తికాకుండా ఎంతమేరకు ఫ్రాడ్ జరిగిందో చెప్పలేమని ఈ విషయాన్ని పీడీ, ఏజీఎం దృష్టిలో పెట్టామన్నారు. సీఐ ఏ చంద్రశేఖర్ మాట్లాడుతూ తనను కట్టేపల్లి సుబ్బారావు వేధిస్తున్నాడని బుక్‌కీపర్ కంద్రు సుమ ఫిర్యాదు చేసిందని తెలిపారు. అలాగే బుక్‌కీపర్ రూ.11.10 లక్షలు నిధులు స్వాహా చేసిందని గ్రూప్ సభ్యులు ఫిర్యాదు చేశారని, వీటిపై విచారణ చేసి కేసులు నమోదు చేస్తామని ఆయన తెలిపారు

బుద్ధునితో నా ప్రయాణం

ఆలోచింపజేసిన నాటక ప్రదర్శన

విజయవాడ కల్చరల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): బుద్ధుడితో నా ప్రయాణం నాటక ప్రదర్శన ఆలోచింపచేసింది. ముమ్మినేని సిద్ధార్థ కళాపీఠం ఆధ్వర్యంలో బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా, కామ్రేడ్ పోలవరపు కోటేశ్వరరావు సాహితీ సమితి, అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ సంస్థల సంయుక్త నిర్వహణలో బుద్ధుడితో నా ప్రయాణం నృత్య రూప నాటకాన్ని ప్రదర్శించారు. భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ రాసిన బుద్ధుడు ఆయన ధర్మ పుస్తకం ఆధారంగా రూపొందించిన నాటక ప్రదర్శన ఆద్యంతం ఆసక్తిగా సాగింది. గత నెలలో 15 ప్రదర్శనలు పూర్తి చేసుకొన్న ఈ సమాజం ఆంధ్రప్రదేశ్‌లో అనంతపురం నుంచి మదనపల్లి మీదుగా నగరంలోని మొగల్రాజపురంలోని సిద్ధార్థ ఆడిటోరియంలో 20వ ప్రదర్శన ఇచ్చారు. ఈ నెలాఖరు వరకు రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో ప్రదర్శన చేయనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. బౌద్ధ బోధనలతో ప్రభావితుడైన అంబేడ్కర్ ఆలోచిస్తూ ఉండగా బుద్ధుడు తన వెంట అంబేడ్కర్‌ను ప్రయాణింపజేస్తూ, తన జీవితంలోని ముఖ్య ఘట్టాలను తెలియజేస్తూ 2 గంటల పాటు నాటకం సాగింది. ఇతివృత్త బలం, చక్కని సంభాషణలు, మధురమైన పాటల మేళవింపుతో నృత్యా విన్యాసాలు వెరసి నాటకం నవరసభరితంగా సాగింది. ఇంకోవైపు సాంకేతిక పరిజ్ఞానం, నాటకాన్ని మరింత ఉన్నత స్థాయిలో కనిపించేందుకు దర్శకులు, సాంకేతిక కళాకారులు చేసిన కృషికి ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నారు. బుద్ధుడిగా ఆనంద్, అంబేడ్కర్‌గా గోపి, యశోదగా రెహనా, సిద్ధార్థగా అఖిల్, సుద్ధోదనుడుగా కొండలరావు, బింబిసార చక్రవర్తిగా లక్ష్మణరావు పలువురు తమపాత్రల్లో అద్భుతంగా నటించారు. ఈ నాటకంలోని ముఖ్య ఘట్టమైన సందర్భంలో బుద్ధుని ప్రవచనాలు, ఆర్యసత్యాలు, అష్టాంగ యోగం గురించి, 'పాపం పుణ్యం ఆత్మ జీవాత్మ ముక్తి మోక్షం సద్ధర్మాచరణ మొదలైన వాటిపై అంబేడ్కర్ ప్రశ్నలకు సమాధానాలు ఆలోచింపజేసేలా ఉన్నాయి. సిద్ధార్థ అకాడమీ, కళాపీఠం ప్రతినిధులు పాల్గొని కళాకారులను ఘనంగా సత్కరించారు. కామ్రేడ్ పోలవరపు కోటేశ్వరరావు, సాహితీ సమితి ప్రతినిధి గోళ్ల నారాయణరావు, నెట్టి రఘురాం, వెల్లంకి నాగభూషణం, పొట్లూరి జనార్ధనమూర్తి, తాతినేని శ్రీహరిరావు, సిద్ధార్థ అకాడమీ కార్యదర్శి లక్ష్మణరావు పాల్గొన్నారు.



బుద్ధునితో నా ప్రయాణం నాటకంలోని ఓ సన్నివేశం

సీసీ కెమెరాలను ఏర్పాటు చేయండి..!

గుడివాడ రూరల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): గుడివాడ రూరల్ మండలంలో లింగవరం వద్ద రెండు కళ్యాణ మండపాలు ఉన్నాయని, అక్కడ తాగుబోతులు వీరంగం వేస్తున్నారని దీంతో పాదచారులు భయభ్రాంతులకు గురవుతున్నారని, వాటి వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరుతూ లింగవరం గ్రామ వాసి అత్తలూరి రవికిరణ్ నిరసన తెలిపారు. పోలీసులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తే రోడ్ల వెంబడి ఖాళీ ప్రదేశాల్లో తాగకుండా నివారించవచ్చునని, పాదచారులు ప్రశాంతంగా ప్రయాణం చేస్తారని తెలిపారు.



సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని నిరసన తెలుపుతున్న రవికిరణ్

అమరావతి రైల్వేలైన్ అలైన్‌మెంట్ మార్పు!

- ఎన్టీఆర్ జిల్లా పరిధిలో మారనున్న అలైన్‌మెంట్
- పాత అలైన్‌మెంట్ ప్రకారం ఇప్పటికే భూసేకరణ నోటిఫికేషన్
- అలైన్‌మెంట్ మార్పు ఉంటుందని సంకేతమిచ్చిన రైల్వే అధికారులు
- జిల్లా రెవెన్యూ యంత్రాంగంతో త్వరలో భేటీ.. వివరణ

ఆంధ్రజ్యోతి, విజయవాడ: అమరావతి రైల్వే లైన్ అలైన్‌మెంట్ విషయంలో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ప్రస్తుత అలైన్‌మెంట్ మారనుందని రైల్వే అధికారులు ఎన్టీఆర్ జిల్లా రెవెన్యూ యంత్రాంగానికి సంకేతాలు పంపారు. ప్రస్తుత అలైన్‌మెంట్ పరిధిలోని ప్రాంతాల్లోనే ఉంటున్నప్పటికీ కొద్దిగా మారుతుంది. అతి త్వరలో ఎన్టీఆర్ జిల్లా రెవెన్యూ అధికారులతో, రైల్వే అధికారులు భేటీ కానున్నారు. ఈ భేటీలో ఎక్కడెక్కడ అలైన్‌మెంట్ మారుతుందన్న దానిపై కలెక్టర్, జాయింట్ కలెక్టర్, జిల్లా రెవెన్యూ అధికారి, ఆర్‌డీవోకు రైల్వే అధికారులు వివరించనున్నారు. తర్వాత క్షేత్ర స్థాయిలో సర్వే నెంబర్లను సరిచూసుకుని సరికొత్తగా భూ సేకరణ నోటిఫికేషన్‌ను వెలువరించనున్నారు. ఇప్పటికే భూ సేకరణ నోటిఫికేషన్‌ను వెలువరించారు. ఈ నోటిఫికేషన్‌కు సంబంధించి రైతుల నుంచి అభ్యంతరాలను స్వీకరించారు. మొదటగా వెలువరించిన భూ సేకరణ నోటిఫికేషన్ ప్రకారం ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం నుంచి కేసీరెడ్డిపల్లి, ఎన్టీఆర్ జిల్లా వీరులపాడు మండలంలో గూడెం మాధవరం, పెద్దాపురం, అల్లూరు, చెన్నారావుపాలెం, జుజ్జూరు, నరసింహారావుపాలెం, కంచికచర్ల మండలంలో గొట్టుముక్కల, పరిటాల, ఇబ్రహీంపట్నం మండలంలో చిలుకూరు, దాములూరు ఉన్నాయి. ఎన్టీఆర్ జిల్లా పరిధిలో మొత్తం 12 గ్రామాల మీదుగా అమరావతి రైల్వే లైన్ వెళుతుంది. అమరావతి నూతన రైల్వే కోసం ఎన్టీఆర్ జిల్లాలో 334.62 ఎకరాల భూములు అవసరం కానున్నాయి. ప్రతిపాదిత భూములకు సంబంధించి ఇప్పటికే ఎన్టీఆర్ జిల్లా రెవెన్యూ యంత్రాంగం భూ సేకరణ నోటిఫికేషన్‌ను ఇచ్చింది. తాజా అలైన్‌మెంట్‌ను రైల్వే అధికారులు ఎందుకుకు మార్చాల్సి వచ్చింది ? ఏ కారణాల చేత మార్చాల్సి వస్తోంది? ఎంత దూరం అలైన్‌మెంట్ జరుపుతున్నారు? అవే గ్రామాలు ఉంటాయా? వంటి వివరాలను వివరించిన తర్వాత పూర్తి స్పష్టత వస్తుంది.





రాజధాని రైతులకు ప్లాట్ల కేటాయింపు

కలెక్టరేట్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ప్రజా రాజధాని అమరావతి నిర్మాణానికి భూములిచ్చిన పెనుమాక గ్రామ జరీబు రైతులకు మంగళవారం విజయవాడలోని సీఆర్‌డీఏ కార్యాలయంలో ఈ-లాటరీ విధానంలో 1,756 రిటర్నబుల్ ప్లాట్లను కేటాయించారు. వీటిలో 1033 నివాస ప్లాట్లు కాగా 723 వాణిజ్య ప్లాట్లు. మొత్తంగా 746 మంది రైతులు, భూ యజమానులకు ఆన్‌లైన్ ర్యాండమ్ సిస్టం ద్వారా ప్లాట్లను కేటాయించారు. ఈ-లాటరీకి హాజరైన రైతులకు నివాస, వాణిజ్య ప్లాట్లకు ముందుగా ట్రైల్ రన్ వేసి తర్వాత ప్రత్యక్ష లాటరీ ప్రక్రియను చేపట్టారు. ప్లాట్లు పొందిన రైతులకు సీఆర్‌డీఏ అధికారులు ప్రొవిజినల్ సర్టిఫికెట్లు అందచేశారు. సీఆర్‌డీఏ ల్యాండ్స్ విభాగం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వీ డేవిడ్‌రాజు మాట్లాడుతూ ప్లాట్లు పొందిన రైతులకు ప్లాట్లు ఎక్కడ కేటాయించబడ్డాయో వివరించడానికి ప్రత్యేకంగా జీఐఎస్ సిబ్బంది, గ్రామ సర్వేయర్‌లను నియమించామన్నారు. రైతులు రిజిస్ట్రేషన్ ప్రక్రియను త్వరగా పూర్తి చేసుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్‌కు ఎలాంటి రుసుము వసూలు చేయబడదన్నారు. ఈ-లాటరీకి హాజరుకాని రైతులు తమ ప్లాట్‌లకు సంబంధించిన ప్రొవిజనల్ సర్టిఫికెట్లను కాంపిటెంట్ అథారిటీ, పెనుమాక కార్యాలయంలో పొందవచ్చునన్నారు. సీఆర్‌డీఏ ఆఫీస్ మేనేజ్‌మెంట్ డైరెక్టర్ వీ శ్రీనివాసరావు, ప్లానింగ్ విభాగం డైరెక్టర్ వీ సురేష్ కుమార్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఏజీ చిన్ని కృష్ణ, ఐటీ విభాగ అదనపు డైరెక్టర్ పెద్ది అజయ్‌బాబు, ప్రాజెక్ట్ మేనేజర్లు లక్ష్మీప్రసన్న, సీహెచ్ శివశంకరరావు, ఇతర అధికారులు, సీఆర్‌డీఏ సిబ్బంది పాల్గొన్నారు.



రైతులకు ప్లాట్లు కేటాయిస్తున్న అధికారులు

రేపు అమరావతిలో జాబ్‌మేళా

- 400కి పైగా ఉద్యోగాల భర్తీ

కలెక్టరేట్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో సీఆర్‌డీఏ సౌజన్యంతో జూలై 24న ఉదయం 10 నుంచి తుళ్లూరులోని సీఆర్‌డీఏ స్కిల్ హబ్ కేంద్రంలో జాబ్‌మేళా నిర్వహించనున్నారు. ఫ్రెషర్స్‌తో పాటు వృత్తి అనుభవం ఉన్నవారితో అయిదు కంపెనీల్లో పలు టెక్నికల్ ఉద్యోగాలను భర్తీ చేయడం జరుగుతుంది. మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్, ఎఫ్‌ట్రానిక్స్ సిస్టం ప్రైవేట్ లిమిటెడ్, డిక్సన్ టెక్నాలజీస్ ఇండియా లిమిటెడ్, హావెల్స్ ఇండియా లిమిటెడ్, కురాకు ఫైనాన్సియల్ సర్వీస్ ప్రైవేట్ లిమిటెడ్, ఫోర్డ్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్ కంపెనీలు పాల్గొంటున్నాయి. టెక్నికల్ సపోర్టు ఇంజినీర్, సొల్యూషన్ సపోర్టు ఇంజినీర్, ఇన్‌స్టాలేషన్ ఇంజినీర్, టీవీ, ఏసీ, వాషింగ్‌మెషిన్ అసెంబ్లింగ్, కస్టమర్ సర్వీస్ ఎగ్జిక్యూటివ్ అండ్ టెలికాలింగ్ (బ్యాంకింగ్ సెక్టార్), జూనియర్, సీనియర్ ఎలక్ట్రిషియన్‌లు, హెచ్‌ఆర్ ఎగ్జిక్యూటివ్‌లతో పాటు ఆయా కంపెనీల్లోని ఇతర విభాగాల్లో ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఈ జాబ్ మేళా నిర్వహిస్తున్నారు. ఎస్ఎస్‌సీ, ఐటీఐ, డిప్లొమో, బీటెక్, ఎంబీఏ, ఏదైనా డిగ్రీ, పీజీ చదివిన ఫ్రెషర్స్, అనుభవం ఉన్న అభ్యర్థులు ఈ జాబ్‌మేళాకు హాజరుకావచ్చు. జాబ్‌మేళాలో ఎంపికైన అభ్యర్థులకు రూ.12 వేల నుంచి 30 వేల వరకు వేతనం లభిస్తుంది. కొన్ని ఉద్యోగాలకు అదనంగా ఇన్సెంటివ్‌లు, అలవెన్సులు లభిస్తాయి. ఎంపికైన అభ్యర్థులు అమరావతి, విజయవాడతో పాటు ఎంపిక చేసిన ప్రాంతాల్లో పనిచేయాల్సి ఉంటుంది. ఈ జాబ్‌మేళా ద్వారా రాజధాని ప్రాంత యువతకు మంచి ఉద్యోగావకాశాలు లభించనున్నాయి. వివరాలకు గ్రామంలోని సీఆర్‌డీఏ ఫెసిలిటేటర్‌ను సంప్రదించవచ్చు. లేదా శంకర్ 9848424207, శ్రీకర్ 9963425999 నెంబర్లకు కాల్ చేయవచ్చు. జాబ్‌మేళాకు రిజిస్ట్రేషన్ చేసుకొనేందుకు పోర్టల్ హెచ్‌టీటీపీఎస్://నైపుణ్యం.ఏపీ.జీఓవీ.ఇన్/లో నమోదు చేసుకోవచ్చు.

ప్రభుత్వ కార్యాలయాల్లో పారిశుధ్య పనితీరు పరిశీలన

గుడ్లవల్లేరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి) :స్వచ్ఛ సర్వేక్షన్‌లో భాగంగా గ్రామాల్లో ప్రభుత్వ కార్యాలయాల్లో పారిశుధ్యం నిర్వహణాతీరును సర్వే చేసేందుకు సెంట్రల్ టీమ్ మంగళవారం కొతవరం గ్రామంలో పర్యటించింది. కొతవరం లోని పాఠశాలలు, అంగన్వాడీ భవనాల్లో, గ్రామ సచివాలయం, గ్రామ పంచాయతీ, గ్రామ రెవెన్యూ కార్యాలయం, ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలను సెంట్రల్ టీమ్ సభ్యుడు రవి వారి బృందం పరిశీలించారు. మరుగుదొడ్ల నిర్వహణ, చెత్త సేకరిస్తున్న విధానాలను వారు అడిగి తెలుసుకొన్నారు. ఎంపీడీవో ఎండి ఇమ్రాన్, డిప్యూటీ ఎంపీడీ నరసింహారావు, జయలక్ష్మి పాల్గొన్నారు.



రెవెన్యూ కార్యాలయాన్ని పరిశీలిస్తున్న రవి

దట్టంగా గుర్రపుడెక్క..మురుగు పోయేదెట్టా..

- ●డ్రెయిన్లలో పేరుకుపోయిన గుర్రపుడెక్క
- ● తూతూమంత్రంగా గుర్రపుడెక్క, నాచు, కిక్కిస తొలగింపు పనులు
- ● కొద్దిపాటి వర్షానికే పొంగుతున్న డ్రెయిన్లు

(ఆంధ్రజ్యోతి - పెదపారుపూడి): గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు డ్రెయిన్లు పొంగి పొర్లడంతో నాట్లు వేసిన పొలాలు నీటమునిగి రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరమ్మతులు చేపట్టని కారణంగా డ్రెయిన్లు పొంగి తమ పొలాలు ముంపు బారిన పడుతున్నాయని రైతులు పేర్కొంటున్నారు. పెదపారుపూడిలోని పాలకోడు డ్రెయిన్‌కు మరమ్మతులు చేయకపోవటంతో గుర్రపు డెక్క అధికంగా ఉండి నీరు కిందకు పారకపోవటంతో పొలాల్లోకి వచ్చి నాట్లు వేసిన పొలాలు ముంపునకు గురవుతున్నాయని రైతు లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలోని వెంట్రప్రగడ, అప్పికట్ల, వానపాముల, జమిదింటకుర్రు,పెదపారుపూడి, జూనపూడి తదితర గ్రామాల్లోని సుమారు 1500 ఎకరాలు ముంపునకు గురయ్యాయని రైతులు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి డ్రెయిన్లలో ఉన్న గుర్రపు డెక్కను తొలగించటంతో పాటు అవసరమైన మరమ్మతులు చేసి నీరు కిందకు పోయేలా చూడాలని రైతులు కోరుతున్నారు.



పెదపారుపూడిలోని పాలకోడు డ్రెయిన్‌లో దట్టంగా పెరిగిన గుర్రపుడెక్క

గుర్రపుడెక్క తొలగించాలి



గత ఐదు సంవత్సరాల కాలంలో డ్రెయిన్లలో గుర్రపుడెక్క తొలగించని కారణంగా తమ పొలాలు ముంపునకు గురై ప్రతీ సంవత్సరం తీవ్రంగా నష్టపోతున్నాం. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం కొంత మేరకు మాత్రమే గుర్రపు డెక్క తొలగించి అధికారులు చేతులు దులుపుకున్నారు. దీంతో తమ గ్రామాల్లోని నాట్లువేసిన పొలాలు నీట మునిగి ఈ ఏడాది కూడా నష్టపోయే పరిస్థితి ఉందన్నారు.

కూచిపూడి సుబ్బయ్య, రైతు

ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాం

డ్రెయిన్లలో పేరుకుపోయిన గుర్రపు డెక్కను తొలగించేందుకు స్థానిక ఎమ్మెల్యే కుమార్‌రాజా దృష్టికి తీసుకెళ్లాం. మెషీన్ల సాయంతో డ్రెయిన్లలో గుర్రపు డెక్కను తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం.

అనీల్ , డ్రెయినేజీ ఏఈ

డ్రెయిన్లకు మరుమ్మతులు చేపట్టాలి



పంట కాలువలు, డ్రెయిన్లకు మరమ్మతులు సకాలంలో చేయకపోవటంతో ఈ ఏడాది కూడా తాము నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. అధికారులు, ప్రజాప్రతినిధులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు.

గారపాటి వీర నాగబాబూరావు, పెదపారుపూడి

హామీల అమలే కూటమి ధ్యేయం

● ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

పమిడిముక్కల, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల సందర్భంగా ఇచ్చిన సూపర్‌సిక్స్ సంక్షేమ పథకాల అమలుకు సీఎం చంద్రబాబు నాయుడు కట్టుబడి ఉన్నారని ఎమ్మెల్యే వర్లకుమార్‌రాజా అన్నారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా మంగళవారం మంటాడలో పర్యటించి కూటమి ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రజలకు తెలియజేసి, సమస్యలు అడిగి తెలుసుకుని పరిష్కరిస్తానని హామీఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో ఏరాష్ట్రంలో లేని విదంగా సామాజిక పించను రూ.4వేలకు పెంచి కూటమి ప్రభుత్వం అందజేస్తుందని, చదువుకునే ప్రతిబిడ్డకు తల్లికి వందనం, మూడు ఉచిత గ్యాస్‌బండలు అందజేస్తున్నారని, అన్నదాత సుఖీభవ, మహిళలకు ఆర్టీసీ బసుల్లో ఉచితప్రయాణం అమలుచేయనున్నారని తెలిపారు. శాలివాహన కార్పొరేషన్ చైర్మ న్ పేరేపి ఈశ్వర్, మండల పార్టీ అధ్యక్షుడు రాజులపాటి శ్రీనివాసరావు, జక్కాశ్రీనివాస రావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.



మంటాడలో సంక్షేమ పథకాల కరప్రతాలు పంచుతున్న ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా, ఈశ్వర్

పామర్రు : ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించడంతోపాటు వారి అవసరాలు తెలుసుకుని వాటిని తీర్చడం కోసమే సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం ముఖ్యోద్ధేశ్యమని టీడీపీ పామర్రు నేత వీరంకి వేంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం స్థానిక 19వార్డులో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకోవడంతోపాటు, ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాల వివరాలు తెలియజేసే కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మోహనరావు తదితరులు పాల్గొన్నారు.



పామర్రులోని 19వ వార్డులో సంక్షేమ పథకాల కరప్రతాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నేతలు

ఆటోమొబైల్ రంగ ఖ్యాతిని పెంపొందిస్తా

● ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడివాడ, జూలై 22(ఆంధ్రజ్యోతి) : దశాబ్దాల చరిత్ర కలిగిన గుడివాడ ఆటోమొబైల్ రంగ అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తానని, ఆటోమొబైల్ రంగఖ్యాతిని ఎట్టి పరిస్థితుల్లో తగ్గనివ్వనని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము తెలిపారు. మంగళవారం ఏటీఎస్ విధానం వల్ల ఇబ్బందులు పడుతున్న ట్రాన్స్‌పోర్టు యజమానులతో కలిసి విజయవాడలోని ట్రాన్స్‌పోర్టు కమిషనర్ మనీష్‌కుమార్ సిన్హాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో ఏటీఎస్ సెంటర్‌ను ఏర్పాటుచేయడం వల్ల కలిగే నష్టాలను ట్రాన్స్‌పోర్టు కమిషనర్‌కు వివరించానన్నారు. గుడివాడ లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అడుసుమిల్లి శ్రీనివాస్, జేఏసీ నాయకులు గుత్తా చంటి పాల్గొన్నారు.

ఏటీఎస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గుడివాడ ట్రాన్స్‌పోర్టు జేఏసీ ఆధ్వర్యంలో చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళవారం స్థానిక ఆర్టీవో కార్యాలయం వద్ద నుంచి ప్రారంభమైన భారీ ర్యాలీని గుడివాడ లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అడుసుమిల్లి శ్రీనివాస్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి గోళ్ళ శివ, ట్యాక్సీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పెదబాబు, దుర్గారావు, వ్యాన్ స్టాండ్ అధ్యక్షుడు గోపాలరావు, పాల్గొన్నారు.



మనీష్‌కుమార్ సిన్హాకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల

పేదల ఆరోగ్య భద్రతే కూటమి ప్రభుత్వ లక్ష్యం

● ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

పామర్రు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): పేదల ఆరోగ్య రక్షణే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. మండల పరిధిలో వివిధ గ్రామాల వారికి సీఎం సహాయ నిధులు రూ.5.52లక్షలు మంజూరయ్యాయి. వాటిని మంగళవారం ఎలకుర్రు, భానుపూడి, జుజ్జువరం, పేరిశేపల్లి, కొమరవోలు గ్రామాల్లోని లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి స్వయంగా చెక్కులందించారు. ఎమ్మెల్యే స్వయంగా లబ్ధిదారుల ఇంటికి వచ్చి స్వయంగా చెక్కులందించడంతో వారు ఎంతో సంతోషం వ్యక్తంచేశారు. ఇదేవిధంగా ఇటీవల కురుమద్దాలి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన పదవతరగతి విద్యార్థి కుటుంబానికి రూ.1.50లక్షల నగదుతోపాటు, సీఎంఆర్ఎఫ్ నిధులనుంచి మంజూరైన రూ.62వేల నగదు చెక్కును వారికుటుంబానికి స్థానిక పార్టీ కార్యాలయంలో అందజేశారు. ఆయన వెంట టీడీపీ మండల అధ్యక్షుడు కుదరవల్లి ప్రవీణ్‌చంద్ర, ఏఎంసీ చైర్మన్ జన్నుశోభన్‌బాబు, మాజీ ఏఎంసీ చైర్మన్ మండపాక శంకర్‌బాబు, కృష్ణాడెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్‌చైర్మన్ వల్లూరిపల్లి గణేష్, మంతెన రామాంజనేయులు, వీరంకి మోహనరావు తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిధారుల ఇంటికి వెళ్లి స్వయంగా సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

స్మార్ట్‌మీటర్ల అదనపు బిల్లును తగ్గించాలి

● టి.లక్ష్మణరావు

గుడివాడ, జూలై 22(ఆంధ్రజ్యోతి) : స్థానిక ఆటోనగర్‌లో స్మార్ట్‌మీటర్లను బిగించడం వల్ల 36మందికి అదనంగా బిల్లు వచ్చిందని, వెంటనే పెరిగిన బిల్లును తగ్గించాలని ది గుడివాడ ఇండస్ట్రియల్ అండ్ ఆటోమొబైల్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు టి.లక్ష్మణరావు కోరారు. మంగళవారం హనుమాన్ జంక్షన్‌లో జరిగిన విద్యుత్ సమస్యల పరిష్కారానికి నిర్వహించిన విద్యుత్ అదాలత్ కార్యక్రమంలో ఈ మేరకు యూనియన్ తరుపున వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు బిగించిన తరువాత 5రెట్లు విద్యుత్ చార్జీలు పెరిగాయని, గతంలో బిల్లులకంటే అదనంగా వచ్చిన బిల్లును ఏం చేస్తారని అధికారులను అడిగితే సమాధానం చెప్పడం లేదన్నారు. కావలసిన లోడు కంటే అదనపు లోడు కలిగిన స్మార్ట్‌మీటర్లను బిగించారని, వాటిని వెంటనే సంబంధిత ల్యాబ్‌కు పంపి పరీక్షలు జరపాలని సూచించామన్నారు. అదనంగా వచ్చిన బిల్లులను వెంటనే తగ్గించాలని, తాము కట్టబోమని స్పష్టం చేశామన్నారు. కన్స్యూమర్ గ్రీవెన్స్ ఫోరం చైర్మన్, న్యాయమూర్తి విక్టర్ ఇమ్మానియేలు దృష్టికి తీసుకువెళ్లామన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కల్వకుంట నాగరాజు, షేక్ మొహిద్దీన్ భాషా, రషీద్‌బేగ్, శ్యాంబాబు, పాల్గొన్నారు.



స్మార్ట్‌మీటర్ల సమస్యను వివరిస్తున్న లక్ష్మణరావు

పదో తరగతి ఉత్తీర్ణతా శాతం పెంచాలి

●ఎంఈవోలు జగన్మోహన్‌రావు, బాలాజీ

గుడివాడ రూరల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): పదవ తరగతి ఉత్తీర్ణత శాతం పెంచటానికి ఉపాధ్యాయులందరూ కలసి కృషి చేద్దామని గుడివాడ ఎంఈవో జగన్మోహన్‌రావు అన్నారు. మంగళవారం స్థానిక ఎస్‌వీఎస్ పాఠశాలలో గుడివాడ రూరల్, అర్బన్ పదవ తరగతి టాప్ 10 విద్యార్థులకు ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహించారు. అప్ కమింగ్ షైనింగ్ స్టార్స్ ప్రోగ్రామ్ కింద మిషన్ 600 కార్యక్రమంపై ప్రత్యేక శిక్షణ పొందిన ఉపాధ్యాయులకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవ తరగతిలోని విద్యార్థులకు గణితం, ఫిజిక్స‌పై గట్టి పట్టు ఉండేలా కృషి చేయాలని కోరారు. ఎంఈవో-2 బాలాజీ మాట్లాడుతూ గుడివాడ రూరల్, అర్బన్ పాఠశాలల్లో ప్రతీ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో కలసి ప్రత్యేక ప్రణాళిక తయారు చేసుకుని విద్యార్థులకు చక్కటి శిక్షణ ఇవ్వాలన్నారు. శిక్షకులు యు.శ్రీనివాసరావు, బి.చంద్రశేఖర్, రమాదేవి, మీరా హుస్సేన్ తదితరుల ఆధ్వర్యంలో శిక్షణా తరగతులు జరిగాయి.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో జగన్మోహనరావు

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

పామర్రు,జూలై 22(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వైపరిత్యాల భారిన పడి పంటనష్టపోయిన వారు పరిహారం పోందేందుకు ప్రధాన మంత్రి ఫసల్ బీమా ద్వారా పంటబీమా చేయించుకోవడంతోపాటుగా, సమగ్ర సస్య రక్షణ చర్యలు పాటించాలని పామర్రు వ్యవసాయ సహాయ సంచాలకులు బి.స్వర్ణలత అన్నారు.

గుడివాడ రూరల్: మోటూరులో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యవసాయ అధికారిణి అనంతలక్ష్మి పాల్గొన్నారు.

పమిడిముక్కల : కపిలేశ్వరపురంలో మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. డీఆర్సీ, డీడీఏ జ్యోతిర్మయి పాల్గొన్నారు.

ముంపునకు గురైన పొలాల్లో నీటిని తోడేయాలి

● వ్యవసాయాధికారి బి.స్వర్ణలత

పామర్రు, జూలై22 (ఆంధ్రజ్యోతి): గత నాలుగురోజుల నుంచి కురిసిన వర్షాలకు ముంపుబారిన పడిన వరి పంట పొలాలు ఇంకా ముంపు బారిలోనే కొనసాగుతున్నాయి. మంగళవారం ఎలకుర్రు, కొరిమెర్ల, ప్రాకెర్ల, నిమ్మలూరు, కురుమద్దాలి, కనుమూరు, ఉరుటూరు, అడ్డాడ తదితర గ్రామాల్లో ముంపునకు గురైన పంట పొలాలను మండల సబ్‌డివిజన్ వ్యవసాయాధికారి బి.స్వర్ణలత ఏవో వి.శివనాగరాణితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరిపొలాల్లో నిలిచి ఉన్న నీటిని బయటకు పంపే మార్గంచూడాలన్నారు. పొలాల్లో నీటిని బయటకు పోయిన నాలుగు రోజుల అనంతరం ఎకరానికి 20కిలోల యూరియా, 20కిలోల పోటాష్ వేసుకోవాలని సూచించారు.



పొలాలను రైతులతో కలిసి పరిశీలిస్తున్న బి.స్వర్ణలత

పాస్‌పోర్టు కోసం పేర్లు నమోదు చేసుకోవాలి

కూచిపూడి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కూచిపూడిలోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం సిద్ధేంద్ర యోగి కూచిపూడి నాట్య కళా పీఠంలో ఈ నెల 28, 29 తేదీల్లో నిర్వహించే పాస్‌పోర్టు క్యాంప్‌లో పాల్గొనే దరఖాస్తుదారులు తమ పేర్లను, ఫోన్ నెంబర్లను గ్రామపంచాయతీ కార్యాలయంలో నమోదు చేసుకోవాలని దీనిపై గ్రామాల్లో ప్రచారాలు సైతం చేయిస్తున్నట్టు ఎంపీడీవో దయాల సుహాసిని పేర్కొన్నారు.

ఇన్వర్టర్ వితరణ

పెదపారుపూడి : మహేశ్వరపురానికి చెందిన దాత మలిరెడ్డి అజాబాబు తహసీల్దార్ కార్యాలయానికి రూ.45 వేల విలువ గల ఇన్వర్టర్‌ను బహూకరించారు. మహేశ్వరపురానికి చెందిన మలిరెడ్డి పద్మావతి జ్ఞాపకార్థం ఆమె భర్త అజాబాబు మంగళవారం పెదపారుపూడి తహసీల్దార్ కార్యాలయంలో వీటిని తహసీల్దార్ శ్రీనునాయక్‌కు అందజేశారు.

మద్యం తాగి ఒకరి మృతి

గుడివాడ రూరల్ : బొమ్ములూరుకు చెందిన మెండా ఆనందరావు (70) మద్యం సేవించి, అనంతరం పచ్చగడ్డికి కొట్టే మందు సేవించి మరణించినట్టు భార్య మెండా జోజి మరియమ్మ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఏఎస్ఐ కృష్ణారావు మంగళవారం తెలిపారు. ఆనందరావు సోమవారం గడ్డి మందు సేవించటం వల్ల అపస్మారక స్థితిలోకి వెళ్లగా, మెరుగైన చికిత్స కోసం విజయవాడ తరలించగా, ఆయన మరణించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

డ్రెయినేజీ పనులను వేగవంతం చేయండి

●ఎమ్మెల్యే వెనిగండ్ల రాము



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెనిగండ్ల

గుడివాడ, జూలై 22(ఆంధ్రజ్యోతి) : అలసత్వానికి తావు లేకుండా డ్రెయినేజీల మరమ్మతుల తదితర అభివృద్ధి పనులను వేగవంతం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. మంగళవారం స్థానిక ప్రజావేదికలో నియోజకవర్గ వ్యాప్తంగా డ్రెయినేజీల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై డ్రెయినేజీ డీఈ నాగేంద్ర కుమార్, ఏఈ అనిల్ కుమార్‌లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా డ్రెయినేజీల్లో తూడుకాడ తొలగింపు, ఇతర అభివృద్ధి పనులు 90శాతంకు పైగా పూర్తయినట్టు తెలిపారు.

శ్రావణమాస మహోత్సవాలు 25 నుంచి

గుడ్లవల్లేరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : వేమవరం కొండాలమ్మ అమ్మవారి ఆలయంలో జూలై 25 నుంచి ఆగస్ట్ 23 వరకూ శ్రావణమాస మహోత్సవాలు నిర్వహించనున్నామని ఆలయ కార్యనిర్వహణాధికారి కొండలరావు తెలిపారు.

మొవ్వ సబ్ రిజిస్ట్రార్‌గా దుర్గారాణి

కూచిపూడి : మొవ్వ సబ్ రిజిస్టర్‌గా కె.దుర్గారాణి బాధ్యతలు చేపట్టారు. నందిగామ సబ్ రిజిస్టర్‌గా పని చేస్తున్న ఆమె అధికారుల ఆదేశాల మేరకు డిప్యూటేషన్‌పై బదిలీ అయ్యారు. ఈ ఏడాది ఫిబ్రవరి 28వ తేదీ నుంచి ఇంచార్జ్ పాలనలో కొనసాగుతున్న ఈ కార్యాలయానికి సబ్ రిజిస్టర్‌గా విచ్చేసిన దుర్గా రాణిని డాక్యుమెంట్ రైటర్స్ కలసి పుష్పగుచ్చాలతో స్వాగతించి అభినందనలు తెలిపారు.

ఇంపాక్ట్ సర్టిఫైడ్ ట్రైనర్‌గా శిరోమణి

గుడివాడ : ఈ నెల 20వతేదీన సికింద్రాబాద్ మినర్వా గ్రాండ్ హోటల్‌లో గుడివాడకు చెందిన వెయిట్ లిఫ్టర్ వడ్లమూడి శిరోమణి ఇంపాక్ట్ సర్టిఫైడ్ ట్రైనర్‌గా సర్టిఫికెట్ అందుకున్నారు. ఫౌండేషన్ ఫౌండర్ గంపా నాగేశ్వరరావు, నేషనల్ బిజినెస్ హెడ్ బి.సుధీర్, రీజనల్ అధ్యక్షుడు దాసరి త్రినాథ్‌ల చేతుల మీదగా ట్రైనర్ సర్టిఫికెట్‌ను అందుకున్నారు.

పేదరికం లేని సమాజమే పీ4 ధ్యేయం

పెదపారుపూడి : పేదరికం లేని సమాజమే పీ4 ధ్యేయమని పెదపారుపూడి ఎంపీడీవో విమాదేవి పేర్కొన్నారు. మంగళవారం పెదపారుపూడి, ఈదులమద్దాలి గ్రామ సభల్లో ఆమె పాల్గొన్నారు. డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాస్, ఈశ్వరి కుమారి, అహల్య, పాల్గొన్నారు.

వృత్తిలో నిబద్ధత, క్రమశిక్షణ అవసరం

గుడివాడ : వృత్తిలో నిబద్ధత, క్రమశిక్షణ అవసరమని, దానిని హోంగార్డు జీవరత్నం తన విధుల్లో చక్కగా పాటించారని ట్రాఫిక్ ఎస్సై నాగరాజు అన్నారు. మంగళవారం స్థానిక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో జీవరత్నం పదవీ విరమణ కార్యక్రమాన్ని ట్రాఫిక్ ఎస్సై నాగరాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జీవరత్నంను ఘనంగా సత్కరించారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	232
చికెన్ స్కిన్‌లెస్	242

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 505

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి సేవలో విజిలెన్స్ అదనపు డైరెక్టర్ రమణమూర్తి



మోపిదేవి, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని విజిలెన్స్ అదనపు డైరెక్టర్ ఎల్.వి.రమణమూర్తి మంగళవారం కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. నాగపుట్టలో పాలుపోసి స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి చిత్ర పటాన్ని, తీర్థ ప్రసాదాల ఆలయ సూపరింటెండెంట్ అచ్యుత మధుసూదనరావు అందజేశారు.



వృద్ధుడిని దత్తత తీసుకున్న యర్రంశెట్టి నాగబాబును సత్కరిస్తున్న పీ-4 అధికారి వెంకటేశ్వరరావు, ప్రత్యేకాధికారి సాయిబాబు

పీ-4 స్ఫూర్తి ప్రదాత నాగబాబు

మోపిదేవి, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : వృద్ధుడిని దత్తత తీసుకున్న ట్యాంక్ వాచర్ యర్రంశెట్టి నాగబాబు స్ఫూర్తి ప్రదాత అని పీ-4 ప్రోగ్రాం అధికారి అనపర్తి వెంకటేశ్వరరావు అన్నారు. మెరకనపల్లిలో మంగళవారం పీ-4 గ్రామసభ జరిగింది. ముఖ్య అతిథిగా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. వంగల నాంచారయ్య (80)ను గ్రామ పంచాయతీ ట్యాంక్ వాచర్ నాగబాబు దత్తత తీసుకున్నట్లు తెలుసుకుని ఘనంగా సత్కరించారు. కేవలం తనకు వచ్చే రూ.6 వేలు వేతనంలోనే మరో వృద్ధునికి సహాయం చేసేందుకు ముందుకు రావటం ఆదర్శనీయమన్నారు. ప్రత్యేకాధికారి పి.సాయిబాబు, ఎంపీపీ రావి దుర్గావాణి, టీడీపీ మండల అధ్యక్షుడు నడకుదుటి జనార్ధనరావు, వైస్ ఎంపీపీ నడకుదుటి జనని కుమారి, సర్పంచ్ యర్రంశెట్టి ధనరాజ్యలక్ష్మి, ఎంపీడీవో స్వర్ణభారతి, డాక్టర్ ఏ.వి.రమణ, డి.వి.సుబ్బారావు పాల్గొన్నారు.



హరిహర వీరమల్లు విజయవంతం కోరుతూ మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి విశేష పూజలు

మోపిదేవి, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్ నటించిన హరిహర వీరమల్లు చిత్రం ఘన విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ నియోజకవర్గ యువ నాయకులు మండలి వెంకట్రామ్ ఆధ్వర్యంలో మంగళవారం సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేశారు. నాగ పుట్టలో పాలు పోసి పసుపు, కుంకుమలు సమర్పించారు. సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానం వేదపండితులచే విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిపించారు. హైదరాబాద్‌కు చెందిన భక్తులు ఎం.రవిచంద్ర, సౌజన్య, రుత్విక్ దేవస్థానంలో పిల్లలకు వేడి పాలు అందించేందుకు రూ.15 వేల విలువైన హీటరును ఈవో దాసరి శ్రీరామ వరప్రసాదరావుకు అందజేశారు. ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ, నాగాయలంక డీసీ చైర్మన్ బండ్రెడ్డి నాగ మల్లిఖార్జునరావు,ర జనసేన నాయకులు, మెగా అభిమానులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అడ్డాడ ప్రసాద్‌బాబు

స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ఆందోళన 5న

చల్లపల్లి, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : స్మార్ట్ మీటర్లను రద్దుచేయాలంటూ ఆగస్టు 5వ తేదీన చేపట్టిన నిరసనలను జయప్రదం చేయాలని నేతలు పిలుపునిచ్చారు. చండ్ర రాజేశ్వరరావు వికాసకేంద్రంలో ప్రజావేదిక ఆధ్వర్యంలో మంగళవారం ఏపీ రైతుసంఘం నాయకులు హనుమానుల సురేంద్రనాద్ బెనర్జీ, సీఐటీయూ కార్యదర్శి మహమ్మద్ కరీముల్లా అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్‌బాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు శీలం నారాయణరావు మాట్లాడుతూ, స్మార్ట్‌మీటర్లకు వ్యతిరేకంగా ఆగస్టు 5న జరిగే నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సీపీఎం మండల కార్యదర్శి యద్దనపూడి మధు, రైతునాయకులు వేమూరి రత్నగిరిరావు, ఆర్య వైశ్యసంఘం నేత వరదా హరిగోపాల్, నేతలు వాకా రామచంద్రరావు, దాని సీతారామరాజు పాల్గొన్నారు.

ఘనంగా మాజీ ఎమ్మెల్యే రమేష్‌బాబు పుట్టినరోజు వేడుక

అవనిగడ్డ, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : మాజీ శాసనసభ్యులు సింహాద్రి రమేష్‌బాబు పుట్టిన రోజు వేడుకలను అవనిగడ్డలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. వివిధ విభాగాలకు చెందిన నేతలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



పెడనలో పర్యటిస్తున్న మున్సిపల్ శాఖా మంత్రి నారాయణ



అర్తమూరులో కాల్వ పూడికతీత పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్



మోదుమూడిలో రంగా విగ్రహానికి నివాళులర్పిస్తున్న కనపర్తి గోవర్ధన్

పెడనలో డ్రెయినేజీ అభివృద్ధికి రూ.2కోట్లు

● మున్సిపల్ శాఖా మంత్రి నారాయణ హామీ

పెడన, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : పెడన మునిసిపాలిటీలో డ్రెయినేజీ వ్యవస్థ అభివృద్ధికి రూ2 కోట్లు, గుణ్ణాల దళితవాడలో కమ్యూనిటీ హాలు నిర్మాణానికి రూ. 20 లక్షలు తక్షణం మంజూరు చేస్తానని మునిసిపల్, పట్టణాబివృద్ధి శాఖా మంత్రి నారాయణ హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. ఏఎంసీ హాలులో ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అధ్యక్షతన జరిగిన కూటమి కార్యకర్తల సమావేశంలో నారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. జగన్ ప్రభుత్వం చేసిన పది లక్షల కోట్ల రూపాయల అప్పుల భారం కూటమి ప్రభుత్వంపై పడిందన్నారు. సీఎం చంద్రబాబు డబ్బు లేకపోయినప్పటికీ ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీకి కట్టుబడి పరిపాలనా దక్షతతో సంక్షేమ పథకాలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ వస్తున్నారన్నారు. స్వచ్ఛమైన తాగునీరు అందించాలన్న ఆశయంతో 2014-19లో మునిసిపల్ పట్టణాభివృద్ధి శాఖా మంత్రిగా ఉన్న సమయంలో పెడన సమగ్ర మంచినీటి పథకానికి ఏఐబీ, అమృత్ పథకం ద్వారా నిధులు మంజూరు చేయించగా వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఆ పథకం ఆగిపోయిందన్నారు. సీఎం చంద్రబాబుకు చెప్పి ఆ పథకాన్ని పునరుద్ధరింప చేశానన్నారు పట్టణ ప్రజలందరికీ తాగునీరు అందించేలా రూ.91.18 కోట్లతో మంచి నీటి పథకం పనులు చేపడతామన్నారు. ప్రస్తుతం ఈ పథకానికి సంబంధించి టెండర్ల ప్రక్రియ జరుగుతుందన్నారు. కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను చెప్పడంతో పాటు గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని ఎలా నాశనం చేసిందో కూడా వివరించాలని నారాయణ పిలుపునిచ్చారు. పెడన మునిసిపాలిటీపై ప్రత్యేక దృష్టి పెట్టి అభివృద్ధి పనులకు ఉదారంగా నిధు లు మంజూరు చేయాలని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ సభాముఖంగా మంత్రిని కోరారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు మాట్లాడుతూ, గత వైసీపీ ప్రభుత్వం అరాచక పాలన సాగిస్తే కూటమి ప్రభుత్వం ప్రజారంజక పాలన అందిస్తోందన్నారు. రాష్ట్ర బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు, నియోజకవర్గ పరిశీలకుడు గొట్టుముక్కల రఘురామరాజు ప్రసంగించారు.

మోదుమూడిలో సుపరిపాలన..

అవనిగడ్డ రూరల్ : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వంలో స్వర్ణయుగం మొదలైందని నియోజకవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు, టీడీపీ నేత బొబ్బా గోవర్ధన్ అన్నారు. మోదుమూడి గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో మంగళవారం వారు పాల్గొన్నారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరు వెంకటేశ్వరరావు, కర్రా సుధాకర్, పరుర్చి దుర్గా ప్రసాద్, బండే శ్రీనివాసరావు, రాఘవ, మండలి రామ్మోహనరావు, మేడికొండ విజయ్, మెరుగు సోమిరెడ్డి, గోపాలకృష్ణ, జొన్నగూటి వెంకన్న, బచ్చు మురళీ, రంగనాథ్, వేణుగోపాల్, వెంకట కృష్ణారావు, తోట సురేష్, దాసినేని సాంబయ్య, కంచర్ల ఆనంద్, కమ్మిలి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

అర్తమూరులో కాల్వ పూడికతీత పనులు ప్రారంభం

బంటుమిల్లి : రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. అర్తమూరులోని నీటమునిగిన పొలాలను మంగళవారం ఆయన పరిశీలించి, కాల్వ పూడికతీత పనులు ప్రారంభించారు. గత ప్రభుత్వం కాల్వల పూ డికతీతను పట్టించుకోకపోవడంతో రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారన్నారు. రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారం కోసం తక్షణ చర్య లు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అర్తమూరు గ్రామంలో దాదాపు ఆరు కిలో మీటర్ల మేర కాల్వ పూడిక తీసేందుకు చర్యలు చేపట్టారు. మండల పార్టీ అధ్యక్షుడు కూనపరెడ్డి వీరబాబు, గ్రామ పార్టీ అధ్యక్షుడు కాగిత బాలాజీ, డీసీ చైర్మన్ కాశీ, తోకల స్వాములు, ఎండి నజీర్, కాగిత రవి కుమార్, రాయపురెడ్డి సూర్యప్రకాశరావు, రత్నమోహన్ రైతులు పాల్గొన్నారు.



కరపత్రాలు అందజేస్తున్న బత్తిన దాసు

బందరు నగరంలో..

మచిలీపట్నం టౌన్, : సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా నగరంలోని పలు వార్డుల్లో టీడీపీ నాయకులు ఇంటింటికీ తిరుగుతూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఒకటో డివిజన్‌లో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ కుంచే నాని, మాజీ కౌన్సిలర్ బత్తిన దాసు, సాతులూరి నాంచారయ్య, జగదీష్ తదితరులు పాల్గొన్నారు. 41వ డివిజన్‌లో వాకమల్లు శ్రీనివాసరావు, పిన్నింటి నాగ అయ్యప్ప, కిలాని అచ్చయ్య నాయుడు పర్యటించారు. 18వ డివిజన్‌లో గోకుల శివ, లంకిశెట్టి నీరజ, ఈడేపల్లిలో టీడీపీ నాయకుడు వేముల బుజ్జి, వివిధ డివిజన్లలో టీడీపీ నగర అధ్యక్షుడు లోగిశెట్టి వెంకటస్వామి పాల్గొన్నారు. కరగ్రహారంలో మార్కెట్ యార్డు డైరెక్టర్ చోడవరపు లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు. ఉల్లిపాలెంలో కమ్మిలి మధు, పోతేపల్లిలో కాటం మధు తదితరులు పాల్గొన్నారు.



ఆకట్టుకున్న మురళీ అష్టావధానం

మచిలీపట్నం టౌన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం బచ్చుపేట వేంకటేశ్వర స్వామి ఆలయంలో పవిత్రోత్సవాల సందర్భంగా ప్రముఖ శతావధాని డాక్టర్ ఆముదాల మురళి సోమవారం రాత్రి నిర్వహించిన అష్టావధానం ప్రేక్షకులను ఆద్యంతం అలరించింది. పృచ్ఛకులు అడిగిన సమస్యలను ఆముదాల మురళి అలవోకగా పూరిస్తూ సాహితీవేత్తలను మైమరపించారు. అష్టావధానానికి సంచాలకులుగా సిరికవి డాక్టర్ చింతలపాటి మోహన మురళీకృష్ణ వ్యవహరించారు. డాక్టర్ పీటీజీవీ రంగాచార్యులు నిషిద్ధాక్షరిని, కె.కనకదుర్గ మహాలక్ష్మి సమస్యను, మద్దూరి రామ్మోహనరావు దత్తపదిని, ఓలేటి ఉమాసరస్వతి వర్ణన, కె. రాజేంద్రప్రసాద్ న్యస్తాక్షరిని, గుడిపూడి రాధికారాణి ఆశువు, దండిబొట్ల దత్తాత్రేయ శర్మ అప్రస్తుత ప్రసంగం చేపట్టారు. పృచ్ఛకులు అడిగిన సమస్యలకు, దత్తపదులకు పద్యాలతో అలవోకగా అవధాని పూరించారు. అప్రస్తుత ప్రసంగానికి అవధాని ఇచ్చిన జవాబులు నవ్వులు పండించాయి. అనంతరం అవధానిని, పృచ్ఛకులను ఆలయ నిర్వాహకులు ముత్తేవి రవి కాంత్ ఘనంగా సత్కరించారు.



సబ్సిడీపై కంది విత్తనాలు పంపిణీ చేస్తున్న ఏవో మురళీకృష్ణ

ప్రతిరైతు పంటల బీమా చేయించుకోవాలి

చల్లపల్లి, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : ప్రతి రైతు పంటల బీమా చేయించుకోవాలనీ మండల వ్యవసాయశాఖ అధికారి కె.మురళీకృష్ణ తెలిపారు. పురిటిగడ్డ, నడకుదురు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులకు సూచనలు చేశారు. వరి రైతులు ఎకరాకు రూ.830 చొప్పున 2025 ఆగస్టు 15 నాటికి రైతు వాటాగా ప్రీమియాన్ని సచివాలయం, సొసైటీ, కామన్ సర్వీస్‌సెంటర్, పోస్టాఫీసులలో చెల్లించవచ్చన్నారు. పసుపు పంటకు రూ.1100 చొప్పున ప్రీమియం నెలాఖరులోగా చెల్లించాలన్నారు. అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకం కింద మండలంలో 4711 మంది లబ్ధిదారుల జాబితాలను రైతుసేవా కేంద్రం నోటీసు బోర్డులో ప్రదర్శించినట్లు చెప్పారు. అర్హులు ఉండి జాబితాలో పేర్లు లేకుంటే ఈనెల 23వ తేదీ సాయంత్రం నాటికి పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ ఇతర వివరాలను సంబంధిత గ్రామ వ్యవసాయ సహాయకునికి అందించాలన్నారు. సబ్సిడీపై రైతులకు కంది విత్తనాలను ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా పంపిణీ చేశారు. సర్పంచ్ మాతంగి రమ్య, ఎంపీటీసీ రాజులపాటి అంకమ్మ, మాజీ సర్పంచ్ పరుచూరి సురేష్, ఈవో జి.శైలజ, కైతేపల్లి శ్రీనివాసరావు, రాజులపాటి జగదీష్, వీఏఏ నాగబాబు, రైతులు పాల్గొన్నారు.

పోస్టల్ సేవలు ప్రజలకు మరింత చేరువ



అవనిగడ్డ, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు పోస్టల్ సేవలు మరింత చేరువ చేసేందుకు కృషి చేస్తున్నట్లు మచిలీపట్నం పోస్టల్ సూపరిటెండెంట్ బి.శ్రీనివాసరావు అన్నారు. భారత ప్రభుత్వ తపాలా శాఖ చేపట్టిన అడ్వాన్స్‌డ్ పోస్టల్ టెక్నాలజీ 2.0 మొదటి దశ సేవలను అవనిగడ్డ హెడ్ పోస్టాఫీసులో మంగళవారం ప్రారంభించారు. కొత్త టెక్నాలజీ ద్వారా ప్రజలు తమ ఇంటి వద్ద నుంచే రిజిస్టర్ లెటర్స్ లేదా స్పీడు పోస్టులను బుక్ చేసుకోవచ్చన్నారు. ఎస్ఎంఎస్, ఈమెయిల్ ద్వారా బుకింగ్, డెవలీవరీకు సంబంధించి అప్‌డేట్‌ను పొందవచ్చన్నారు. ఈ సాఫ్ట్ వేర్ ద్వారా ఓటీపీ లేదా ఆధార్ ఆధారిత డెలివరీని ప్రజలు ఎంచుకోవచ్చునని, యూపీఐ ద్వారా నగదు లావాదేవీలు చేసే సౌకర్యం కూడా ఉందన్నారు. అసిస్టెంట్ సూపరిటెండెంట్ నాగరాజు, పోస్టుమాస్టర్ సుధాకర్, డిప్యూటీ పోస్టు మాస్టర్ నాగేశ్వరరావు, సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

గాంధీక్షేత్రంలో దాశరథికి ఘననివాళి

అవనిగడ్డ, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : శత జయంతి వేడుకల సందర్భంగా గాంధీక్షేత్రంలో దాశరథి చిత్రపటానికి మండలి వెంకట్రామ్ తదితరులు ఘనంగా నివాళులర్పించారు. ప్రముఖ కవి గుడిసేవ విష్ణు ప్రసాద్ దాశరథి ఖ్యాతిని వివరించారు. దివిసీమ లలిత కళా సమితి ప్రధాన కార్యదర్శి కూనపరెడ్డి చంద్రశేఖర్ దాశరథి రచించిన గీతాలు ఆలపించారు. రేపల్లె రవీంద్ర, సింహాద్రి పవన్, ముళ్లపూడి శ్రీను, మధవ, గరికపాటి శ్రీనివాస్, రెడ్రౌతు కృష్ణబాబు, రేపల్లె వెంకట కృష్ణారావు, తుంగల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పేదరికం లేని సమాజమే లక్ష్యం

● అసిస్టెంట్ కమిషనర్ గోపాలరావు

మచిలీపట్నం టౌన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : పేదరికం లేని సమాజమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని, ఇందుకు దాతలు, ఎన్ఆర్ఐల సహాయ సహకారాలు తీసుకోవాలని నగర పాలక సంస్థ అసిస్టెంట్ కమిషనర్ ఏ.వి.గోపాలరావు అన్నారు. 45వ డివిజన్‌లో మంగళవారం పీ-4 సర్వేపై సమావేశం నిర్వహించారు. అసిస్టెంట్ కమిషనర్ గోపాలరావు మాట్లాడుతూ, నగరంలో బంగారు కుటుంబాల కింద పేద కుటుంబాలను గుర్తించాలన్నారు. పేదరిక నిర్మూలనే ప్రభుత్వ లక్ష్యమన్నారు. టీడీపీ నాయకుడు పి.వి.ఫణికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్‌తో పాటు ఇంజనీర్ ఆర్.వి.ఎస్ మురళీధర్, డాక్టర్ బొల్లా ప్రసాద్, కాళీపట్నపు రఘు, నగర పాలక సంస్థ సీనియర్ అసిస్టెంట్ కె.ఎన్.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవాలి

● పీఆర్ ఏఈ బ్రహ్మానందబాబు

అవనిగడ్డ రూరల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : అశ్వారావుపాలెం గ్రామంలో బంగారు కుటుంబాలను దత్తత తీసుకునేలా దాతలను ప్రోత్సహించాలని పంచాయతీరాజ్ ఏఈ బ్రహ్మానంద బాబు అధికారులకు సూచించారు. అశ్వారావుపాలెంలో మంగళవారం గ్రామసభ నిర్వహించారు. గ్రామసర్పంచ్ పండ్రాజు లంకమ్మ ప్రసాద్ 18 పేద ఎస్టీ కుటుంబాలను దత్తత తీసుకున్నట్లు తెలి పారు. బ్రహ్మానంద బాబు మా ట్లాడుతూ సమాజంలో నిరుపే దలకు సాయం అందించాలనే లక్ష్యంతో పీ-4 కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు పేద వర్గాలకు మరింత మెరుగైన సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ఉపసర్పంచ్ యక్కటి నాగరాజు, పంచాయతీ కార్యదర్శి సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

సామాజిక మాధ్యమాలతో మెరుగైన సేవలు : ఎస్పీ

మచిలీపట్నం క్రైమ్, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజలకు మరింత చేరువగా సేవలు అందిస్తున్నట్టు ఎస్పీ ఆర్.గంగాధరరావు ఒక ప్రకటనలో తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజల భాగస్వాన్ని పెంపొందించేందుకు సామాజిక మాధ్యమాలు ఎంతగానో తోడ్పడుతున్నాయన్నారు. సైబర్ నేరాలను అరికట్టేందుకు, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. నూతన పోలీసింగ్ విధానాల పట్ల ప్రజల్లో అవగాహన కల్పించేందుకు సామాజిక మాధ్యమాలను వినియోగిస్తున్నామన్నారు. ఫేస్‌బుక్, యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్, ట్విట్టర్‌ల సేవలన్నీ ఒకే వేదికపై తీసుకురావటం జరిగిందన్నారు. లోగోలపై క్లిక్ చేస్తే యాప్ ఓపెన్ అయ్యి సమాచారం అందుబాటులోకి వస్తుందన్నారు.

రహదారిపై దమ్ముచక్రాల ట్రాక్టర్లను నిరోధించాలి

కోడూరు. జూలై 22 (ఆంధ్రజ్యోతి) : గత ఆరు సంవత్సరాలుగా కోడూరు - అవనిగడ్డ మార్గంలో గోతుల్లో ప్రయాణం సాగించిన ప్రజలకు రహదారిని అభివృద్ధి చేయడంతో కష్టాలు తొలగాయి. కూటమి ప్రభుత్వం రూ.16.80 కోట్లు వెచ్చించి కోడూరు - అవనిగడ్డ రహదారి నిర్మించింది. రహదారి సమీపాన మాచవరం, జయపురం, కొత్తపాలెం గ్రామాల రైతుల పొలాలు ఉండటంతో వ్యవసాయ సీజన్ ప్రారంభం కావటంతో దమ్ము చక్రాలతో కూడిన ట్రాక్టర్లను రహదారిపై తిప్పుతున్నారని, దీంతో రోడ్డు దెబ్బతింటోందని గ్రామస్థులు తెలిపారు. మండల స్థాయి అధికారులు ఈ విషయమై దృష్టి సారించాలని, ఆర్ అండ్ బి రహదారులపై దమ్ము చక్రాలతో ట్రాక్టర్లు వెళ్లేటప్పుడు పట్టాలు కట్టుకుని వెళ్లేలా చూడాలని కోరుతున్నారు.

అనధికార మద్యం స్వాధీనం

మచిలీపట్నం క్రైమ్, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ ఆధ్వర్యంలో బలరాముని పేటలో మంగళవారం దాడులు నిర్వహించారు. అనధికారికంగా మద్యం అమ్ముతున్న మేకల మారుతిని అదుపులోకి తీసుకుని, అతని వద్ద 40 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని, వాహనాన్ని సీజ్ చేశారు. సీఐ లక్ష్మణరావు సిబ్బంది సుబ్రహ్మణ్యం, వేణు. రంజిత్, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

చిట్టిపాలెంలో ఉచిత వైద్యశిబిరం 27న

మచిలీపట్నం టౌన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : చిట్టిపాలెంలో ఈనెల 27వ తేదీ ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్టు మచిలీపట్నం సత్యసాయి సేవా సమితి కన్వీనర్ పోతుకూచి ఆంజనేయకుమార్ తెలిపారు. పంచాయతీ కార్యాలయంలో మంగళవారం శిబిరం కరపత్రాలను ఆవిష్కరించారు. సత్యసా యి గ్రామీణ సంచార వైద్య సేవా శిబిరాలు నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఉపేంద్ర, డాక్టర్ రత్తయ్య, ఎస్. నాగమణి, విశాలి, పవన్ పాల్గొన్నారు. వైద్య సేవా శిబిరంలో డాక్టర్ సాయిప్రసాద్ ప్రముఖ వైద్యులు సేవలందిస్తారన్నారు.

శాకంబరిగా బొబ్బర్లంక అంకమ్మ



మోపిదేవి, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : బొబ్బర్లంక అంకమ్మ తల్లికి ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని మంగళవారం శాకంబరి మహోత్సవం వైభవం గా జరిగింది. వివిధ రకాల పండ్లు, కూరగాయలతో అమ్మవారిని విశేష అలంకరణ చేశారు. శాకంబరీ అలంకరణలో అంకమ్మ తల్లిని భక్తులు దర్శించుకున్నారు. కమిటీ సభ్యులు భక్తులకు అవసరమైన ఏర్పాట్లు పర్యవేక్షించారు.